మీరే
చదువరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త
వార్తలు చదవండి...



PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com



మీరే
విలేకరి..
క్యూఆర్ కోడ్
స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని
వార్తలు పంపండి..



సోమవారం MONDAY 18-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 319 Issue: 318

Circulated to Telangana
Published from Jagitial


18 మే 2026 - సోమవారం శ్రీ పరాభవ నామ సంవత్సరం ఉత్తరాయణం - గ్రీష్మ ఋతువు జ్యేష్ఠ(అధిక) మాసం - శుక్లపక్షం సూర్యోదయం - తె. 5:47 సూర్యాస్తమయం - సా. 6:38 తిథి విదియ సా. 5:55 వరకు తరువాత తదియ సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం రోహిణి ఉ. 11:32 వరకు తరువాత మృగశిర యోగం సుకర్మ రా. 9:47 వరకు కరణం భాలవ ఉ. 7:46 వరకు కౌలవ సా. 5:55 వరకు వర్జ్యం తె. 4:31 నుండి తె. 5:55 వరకు దుర్ముహూర్తం మ. 12:38 నుండి మ. 1:29 వరకు మ. 3:12 నుండి సా. 4:03 వరకు రాహుకాలం ఉ. 7:23 నుండి ఉ. 8:59 వరకు యమగండం ఉ. 10:36 నుండి మ. 12:12 వరకు గుళికాకాలం మ. 1:49 నుండి మ. 3:25 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:11 నుండి తె. 4:59 వరకు అమృత ఘడియలు ఉ. 8:43 నుండి ఉ. 10:07 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:46 నుండి మ. 12:38 వరకు గమనిక: "ం" అనగా మరుసటి రోజున



# ఉద్యమకారులు 4 రకాలు

**గుర్తింపునకు కేటగిరీలుగా విభజన**

**ప్రాణాలు కోల్పోయినవారికి తొలి ప్రాధాన్యం**

**రాజకీయాలకు అతీతంగా గుర్తింపు**

**కేకే నేతృత్వంలో కమిటీ తొలి భేటీ**

**జిల్లాల పర్యటనలు చేయాలని నిర్ణయం**

తెలంగాణ ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉన్నతస్థాయి కమిటీ కీలక నిర్ణయాలు తీసుకుంది. ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు నేతృత్వంలోని ఈ కమిటీ ఆదివారం తొలిసారి సమావేశమై, అసలైన ఉద్యమకారులను నాలుగు కేటగిరీల కింద గుర్తించాలని తీర్మానించింది. ఈ ప్రక్రియను రాజకీయాలకు అతీతంగా, అత్యంత పారదర్శకంగా నిర్వహిస్తామని కమిటీ స్పష్టం చేసింది.

హైదరాబాద్, మే 17 (ఈవార్తలు):సమావేశం అనంతరం కమిటీ తీసుకున్న నిర్ణయాలను మీడియాకు వెల్లడించారు. దీని ప్రకారం, తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులకు మొదటి ప్రాధాన్యం ఇవ్వనున్నారు. ఉద్యమ సమయంలో గాయపడిన వారిని రెండో కేటగిరీలో, అరెస్టులు, జైలు జీవితం, కేసులు ఎదుర్కొన్న వారిని మూడో కేటగిరీలో చేర్చనున్నారు. ఇక క్షేత్రస్థాయిలో ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్న వారిని నాలుగో కేటగిరీ కింద గుర్తించనున్నారు. వీరిని గుర్తించేందుకు అప్పటి వార్తాపత్రికల క్లిప్పింగులను ఆధారంగా తీసుకోనున్నారు. గత ప్రభుత్వం కొద్దిమందికి మాత్రమే లబ్ధి చేకూర్చిందని, తమ ప్రక్రియ అలా ఉండదని కమిటీ తేల్చిచెప్పింది. ఉద్యమకారుల గుర్తింపునకు కఠినమైన ప్రమాణాలను రూపొందిస్తామని, సంక్షేమ పథకాలు, ప్రభుత్వ గౌరవం అందించేందుకు సమగ్ర డేటాబేస్ తరువాయి 2 వ పేజీలో...



# టీజీ ఎప్‌సెట్ ఫలితాలు విడుదల

రాష్ట్రంలో ఇంజినీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించిన తెలంగాణ ఎప్‌సెట్ ఫలితాలు విడుదలయ్యాయి. హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ సాంకేతిక విశ్వవిద్యాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో అధికారులు ఈ ఫలితాలను ఆవిష్కరించారు.

హైదరాబాద్, మే 17 (ఈవార్తలు): ప్రభుత్వ సలహాదారు కె. కేశవరావు, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య వి. బాలకిష్టారెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ శ్రీదేవసేన బటన్ నొక్కి ఫలితాలను, విద్యార్థుల సాధించిన ర్యాంకులను విడుదల చేశారు. ఇంజినీరింగ్ విభాగంలో హైదరాబాద్ ఉప్పల్‌కు చెందిన ఎం. రిషి ఫస్ట్ ర్యాంకు, హైదరాబాద్ మూసాపేటకు చెందిన అన్షు రెండో ర్యాంకు , కడపకు చెందిన వంశీధర్ రెడ్డి మూడో ర్యాంకు సాధించినట్లు అధికారులు తెలిపారు. అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో ముకరం తరువాయి 2 వ పేజీలో...

# 7 నిమిషాల్లో.. క్యాన్సర్ చికిత్స

**స్విస్ ఫార్మా కంపెనీ కొత్త డ్రగ్.. క్యాన్సర్ చికిత్సలో విప్లవాత్మక మార్పు**

ఊపిరితిత్తుల క్యాన్సర్ రోగులకు ఇక ఆసుపత్రుల్లో గంటల తరబడి కూర్చునే బాధ తగ్గనుంది. ప్రపంచంలోనే తొలిసారిగా కేవలం ఏడు నిమిషాల్లో పూర్తి అయ్యే సబ్క్యుటేనియస్ ఇమ్యునోథెరపీని స్విట్జర్లాండ్‌కు చెందిన రోష్ ఫార్మా సంస్థ భారతదేశంలో ప్రారంభించింది. లంగ్ క్యాన్సర్ చికిత్సలో ఇది ఒక పెద్ద ముందడుగుగా వైద్య రంగం భావిస్తోంది. ఇప్పటివరకు క్యాన్సర్ ఇమ్యునోథెరపీ కోసం రోగులు గంటల పాటు ఆసుపత్రుల్లో ఉండాల్సి వచ్చేది. అయితే ఇప్పుడు "టెసెంట్రిక్ ఎస్సీ" అనే కొత్త ఔషధంతో కేవలం ఏడు నిమిషాల్లోనే చికిత్స పూర్తవుతుంది.



బెర్న్/న్యూఢిల్లీ: చర్మం కింద ఇచ్చే ఈ సబ్క్యుటేనియస్ విధానం వల్ల రోగులకు సమయం, శ్రమ రెండూ తగ్గనున్నాయి. ముఖ్యంగా తీవ్ర అస్వస్థతలో ఉన్న రోగులకు ఇది ఎంతో ఉపశమనం కలిగించే అవకాశముంది. రోష్ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ కొత్త చికిత్స విధానం ద్వారా చికిత్స సమయం దాదాపు 80 శాతం వరకు తగ్గనుంది. తరువాయి 2 వ పేజీలో...



# హైకోర్టు మహిళా జడ్జిపై ట్రోలింగ్

**బండి భగీరథ్ పోక్సో కేసు విచారణలో ఆవేదన వ్యక్తం చేసిన న్యాయమూర్తి**

## తప్పుడు ప్రచారంపై కేసు నమోదు

బండి భగీరథ్ పోక్సో కేసులో కొందరు సోషల్ మీడియా వేదికగా న్యాయవ్యవస్థపైనే దాడికి దిగారు. తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ టి. మాధవి దేవిని వ్యక్తిగతంగా లక్ష్యంగా చేసుకుని కొన్ని ఐటీ సెల్స్, సోషల్ మీడియా ఖాతాలలో తీవ్రమైన నిరాధార ఆరోపణలు చేశారు. బండి భగీరథ్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే.. దానికి ప్రతిఫలంగా జడ్జి భర్తకు బార్ కౌన్సిల్ ఛైర్మన్ పదవి ఇస్తారంటూ దుష్ప్రచారం నడిపారు.

హైదరాబాద్, మే 17 (ఈవార్తలు): ఈ సోషల్ మీడియా పోస్టులపై శుక్రవారం రాత్రి విచారణ ప్రారంభంలోనే జస్టిస్ మాధవి దేవి కోర్టు హాల్లోనే తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. తన నిష్పాక్షికతను శంకించేలా చేసిన ఈ ప్రచారం తనను ఎంతగానో కలిచివేసిందని పేర్కొంటూ.. బాధితురాలి తరపు న్యాయవాదికి అభ్యంతరాలు ఉంటే తానే ఈ కేసు విచారణ నుంచి తప్పుకుంటానని స్పష్టం చేశారు. అయితే న్యాయవాదులు ఆమెను వారించడంతో విచారణ కొనసాగించిన న్యాయమూర్తి.. భగీరథ్‌కు ముందస్తు బెయిల్ ఇవ్వడానికి నిరాకరించారు. నిష్పక్షపాతంగా తీర్పులు ఇచ్చే న్యాయమూర్తులను మానసికంగా దెబ్బతీసేందుకు, వారిని భయభ్రాంతులకు గురిచేసేందుకు సోషల్ మీడియా వేదికగా జరుగుతున్న ఇటువంటి -2 వ పేజీలో...




బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,791 |
| వెండి (కిలో): | రూ.3,05,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,154 |



# యాదాద్రి ప్లాంట్‌లో భారీ అగ్నిప్రమాదం

## యూనిట్-3లో ఎగసిన మంటలు

నల్లగొండ, మే 17 (ఈవార్తలు): నల్లగొండ జిల్లా దామరచర్లలో నిర్మాణ దశలో ఉన్న యాదాద్రి అల్ట్రా మెగా థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఆదివారం భారీ అగ్నిప్రమాదం సంభవించింది. ప్లాంట్‌లోని యూనిట్-3లో ఒక్కసారిగా -2 వ పేజీలో...

# బండీ.. దిగిపో

**కేంద్ర మంత్రిగా కొనసాగడం దేశానికి అవమానం**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపాటు**



కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌ని మంత్రివర్గం నుంచి వెంటనే బర్తరఫ్ చేయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. ఆదివారం ఎల్బీనగర్‌లో నిర్వహించిన 'నా బూత్- నా భవిష్యత్తు' కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.

హైదరాబాద్, మే 17 (ఈవార్తలు): బండి సంజయ్ కుమారుడు భగీరథ్ పోక్సో కేసులో అరెస్టైన నేపథ్యంలో కేటీఆర్ ఈ విమర్శలు చేశారు. రాష్ట్రంలో ఒక బాలికకు తీవ్ర అన్యాయం జరిగితే ప్రభుత్వం ఏమాత్రం పట్టించుకోకుండా మిన్నకుండిపోయిందని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీ పార్టీలు కలిసి బాధితురాలికి అన్యాయం చేయాలని చూశాయని కేటీఆర్ విమర్శించారు. కానీ ఆ బాలికకు న్యాయం జరిగేలా బీఆర్ఎస్ పార్టీ మాత్రమే పోరాడిందని తెలిపారు. గత రెండున్నరేళ్లుగా తెలంగాణలో శాంతిభద్రతలు పూర్తిగా తరువాయి 2 వ పేజీలో...

# భగీరథ్‌ను పట్టుకోవడం చేతకాలేదా?

**పోలీసులపై సీపీఐ నారాయణ ఫైర్**



రాష్ట్రంలోనే కాకుండా జాతీయ స్థాయిలోనూ తీవ్ర చర్చనీయాంశంగా మారిన బండి భగీరథ్ కేసులో వైఫల్యాలు స్పష్టంగా ఉన్నాయని.. సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ తీవ్ర విమర్శలు చేశారు. బండి భగీరథ్‌పై బాధితులు ఫిర్యాదు చేసి, కేసు పెట్టిన వెంటనే అతడిని అరెస్ట్ చేసి ఉంటే.. ఇంత గొడవ జరిగేది కాదని పేర్కొన్నారు.

## విశ్వవాణి



చైనా శాస్త్రవేత్తలు అద్భుతం చేశారు. క్యాన్సర్ వల్ల దెబ్బతిన్న వెన్నుపూసను 19 సెంటీమీటర్ల 3డీ ప్రింటెడ్ టైటానియం ఇంప్లాంట్ వాడి సరి చేశారు. సదరు రోగి ప్రస్తుతం ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉన్నాడు. తాజా ఆవిష్కరణ వైద్య రంగంలో సరికొత్త విప్లవానికి నాంది పలికింది.

# బయటికి వెళ్లొద్దు!

**ఈ వారం నిప్పుల కుంపటే.. మధ్యాహ్నం ఇంట్లోనే ఉండాలి**

**వాతావరణ శాఖ హెచ్చరికలు.. పలు జిల్లాలకు రెడ్, ఆరెంజ్ అలర్ట్**

హైదరాబాద్, మే 17 (ఈవార్తలు): తెలంగాణలో వచ్చే వారం రోజుల పాటు ఎండలు తారెత్తించనున్నట్లు వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నెల 19వ తేదీ నుంచి 24వ తేదీ వరకు రాష్ట్రంలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశాలు ఉన్నాయని తెలిపింది. తీవ్ర వడగాల్పులు వీచే అవకాశాలు ఉన్నాయని పేర్కొంది. సగటున 45 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదు కానున్నట్లు వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర వడగాలులు వీచే అవకాశాలు ఉన్నాయని వివరించింది. మధ్యాహ్నం సమయంలో భీకరమైన ఎండలు ఉంటాయని.. అత్యవసరం అయితే తప్ప ఇంటి నుంచి బయటికి రావద్దని సూచించింది. ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం తరువాయి 2 వ పేజీలో...





# కొత్త ఆధార్ యాప్!

## ఎంఆధార్‌కు ఉడాయ్ స్వస్తి

న్యూఢిల్లీ: ఎంఆధార్ యాప్ త్వరలో నిలిచిపోతుందని.. యూజర్లు కొత్తగా ప్రారంభమైన ఆధార్ యాప్ వైపు మారాలని యూనిక్ ఐడెంటిఫికేషన్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఉడాయ్) ప్రకటించింది. కొత్త ఆధార్ యాప్ క్యూఆర్ బేస్డ్ ఆధార్ షేరింగ్, ఫేస్ ఆథెంటికేషన్, ఆఫ్‌లైన్ వెరిఫికేషన్, బయోమెట్రిక్ లాక్ కంట్రోల్, మెరుగైన ప్రైవసీ ఎంపికలను కలిగి ఉంటుంది. కాబట్టి వినియోగదారులు దీనిని ఉపయోగించుకోవాలని యూఐడీఏఐ సూచించింది. కొత్త ఆధార్ తరువాయి 2 వ పేజీలో...

# 14 మంది ఇన్‌ఫ్లుయెన్సర్లపై కేసులు

**బండి భగీరథ్‌కు మద్దతుగా వీడియోలు**

**భగీరథ్ తప్పు చేయలేదని పోస్టులు**



హైదరాబాద్, మే 17 (ఈవార్తలు): కొన్ని రోజులుగా బండి భగీరథ్‌కు మద్దతుగా సోషల్ మీడియాలో విపరీతంగా ప్రచారం చేసిన పలువురు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లపై కేసులు నమోదయ్యాయి. మొత్తం 27 మంది ఇన్‌ఫ్లుయెన్సర్లపై ఫిర్యాదులు వెల్లువెత్తగా వాటిపై విచారణ జరిపి 14 మందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశారు. మిగిలిన వారి విషయంలో దర్యాప్తు చేపట్టి.. తదుపరి చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. అయితే తెలుగు రాష్ట్రాలతోపాటు -2 వ పేజీలో...



# యువతి దారుణహత్య.. ఆపై ప్రేమోన్మాది హతం!

జడ్చర్ల, మే 17 (ఈవార్తలు): మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో యువతి గొంతుకోసి చంపిన ప్రేమోన్మాది ప్రజల దాడిలో హతమయ్యాడు. ప్రేమను నిరాకరించిందన్న కక్షతో ఓ యువతిని దారుణంగా హత్య చేసిన యువకుడు, ఆ తర్వాత స్థానికుల దాడిలో తీవ్రంగా గాయపడి, చికిత్స పొందుతూ మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే... జడ్చర్లలోని నిమ్మబావిగడ్డకు చెందిన వైష్ణవి (24) పోలేపల్లి సెజ్‌లోని ఓ పాఠశాలలో రిసెప్షనిస్ట్‌గా పనిచేస్తోంది. శనివారం సాయంత్రం విధులను ముగించుకుని ఇంటికి వెళుతుండగా, అదే ప్రాంతానికి చెందిన తేజ ఆమెను అడ్డగించాడు. తనను ప్రేమించాలని కొంతకాలంగా వేధిస్తున్న తేజ, వెంట తెచ్చుకున్న కత్తితో వైష్ణవిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. గొంతు, కడుపు భాగాల్లో పొడవడంతో ఆమె తీవ్ర రక్తస్రావంతో అక్కడికక్కడే కుప్పకూలి మృతి చెందింది. ఈ దారుణాన్ని కళ్లారా చూసిన వైష్ణవి కుటుంబ సభ్యులు, స్థానికులు ఆగ్రహంతో ఊగిపోయారు. తేజను పట్టుకుని కాళ్లు, చేతులు కట్టేసి తీవ్రంగా కొట్టారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, తీవ్ర గాయాలతో ఉన్న తేజను మహబూబ్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం తెల్లవారుజామున అతడు మృతి చెందాడు. గత రెండేళ్లుగా తేజ తమ కుమార్తెను ప్రేమ పేరుతో వేధిస్తున్నాడని, ఆమె నిరాకరించడంతోనే ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని వైష్ణవి కుటుంబ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఇటీవల వైష్ణవికి వేరొకరితో నిశ్చితార్థం జరగడం కూడా తేజ కక్ష పెంచుకోవడానికి కారణమైందని చెబుతున్నారు. మరోవైపు, చనిపోయే ముందు తేజ... "వైష్ణవి నన్ను వాడుకుని డబ్బులు తీసుకుని మోసం చేసింది, అందుకే హత్య చేశాను" అని చెప్పినట్లుగా సమాచారం. ఈ ప్రేమ వ్యవహారం ఇద్దరి ప్రాణాలను బలి తీసుకోవడంతో జడ్చర్లలో విషాద ఛాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# ఆలస్యంగానే రుతుపవనాలు

**జూన్ మొదటి వారంలో నైరుతి రాక**

**గతేడాది కన్నా 4 నుంచి 5 రోజులు ఆలస్యం**

హైదరాబాద్, మే 17 (ఈవార్తలు): తెలంగాణలో నైరుతి రుతుపవనాల ఆగమనం కోసం మరికొన్ని రోజులు ఆగాల్సిందే. ఈ ఏడాది నైరుతి రుతుపవనాలు జూన్ మొదటి వారంలో రాష్ట్రంలోకి ప్రవేశించే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ (ఐఎండీ) అంచనా వేసింది. గత ఏడాదితో పోలిస్తే రుతుపవనాల రాక 4 నుంచి 5 రోజులు ఆలస్యం కానుంది. ఈ నెల 26వ తేదీన కేరళను తాకనున్న రుతుపవనాలు, ఆ తర్వాత సాధారణంగా 4 నుంచి 7 రోజుల్లో తెలంగాణలోకి ప్రవేశిస్తాయని అధికారులు వివరిస్తున్నారు. ప్రస్తుతం నైరుతి రుతుపవనాలు అండమాన్ నికోబార్ దీవులు, బంగాళాఖాతం, అరేబియా సముద్రంలోని కొన్ని ప్రాంతాల్లో విస్తరించాయి. ఇవి మరింత ముందుకు సాగేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని వాతావరణ శాఖ తెలిపింది. ఇదిలా ఉండగా, రాష్ట్రంలో ఎండల తీవ్రత కొనసాగుతోంది. చాలా ప్రాంతాల్లో సాధారణం కంటే 2 నుంచి 4 డిగ్రీల అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. శనివారం అదిలాబాద్‌లో అత్యధికంగా 44.8 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత రికార్డయింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు. మరోవైపు, నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో ఆదివారం జోగులాంబ గద్వాల్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, రంగారెడ్డి, వనపర్తి జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ పేర్కొంది.



# టీఆర్ఎస్‌లో చేరికల జోరు

**కవిత సమక్షంలో భారీ జాయినింగ్స్.. ఒకేసారి 200 మంది చేరిక**

హైదరాబాద్, మే 17 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాల్లో కొత్త కదలికలు కనిపిస్తున్నాయి. తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్)లో వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో చేరడం రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత స్వయంగా కండువాలు కప్పి వారిని ఆహ్వానిస్తున్నారు. ఆదివారం హైదరాబాద్ బంజారాహిల్స్‌లోని తెలంగాణ రక్షణ సేన పార్టీ కార్యాలయం రాజకీయ సందడితో కళకళలాడింది. రాష్ట్రంలోని పలు నియోజకవర్గాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు టీఆర్ఎస్‌లో చేరేందుకు పెద్ద ఎత్తున తరలివచ్చారు. పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత వారిని ఆత్మీయంగా స్వాగతించి పార్టీ కండువాలు కప్పి అధికారికంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద కార్యకర్తలు నినాదాలతో ఉత్సాహభరిత వాతావరణాన్ని సృష్టించారు. ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గం నుంచి మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు ఆధ్వర్యంలో 200 మందికి పైగా నాయకులు, కార్యకర్తలు టీఆర్ఎస్‌లో చేరడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామస్థాయి నాయకులు, యువకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పార్టీలో చేరడం ద్వారా బోథ్ ప్రాంతంలో టీఆర్ఎస్ బలం పెరుగుతోందని పార్టీ నేతలు చెబుతున్నారు. రాబోయే రాజకీయ పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ప్రజలు టీఆర్ఎస్ వైపు ఆకర్షితులవుతున్నారని నాయకులు అభిప్రాయపడ్డారు. సీనియర్ నాయకుడు మతిన్ ఆధ్వర్యంలో అంబర్‌పేట్ నియోజకవర్గానికి చెందిన ముస్లిం మహిళలు పెద్ద సంఖ్యలో టీఆర్ఎస్‌లో చేరారు. మహిళలకు రాజకీయాల్లో ప్రాధాన్యం కల్పిస్తున్న పార్టీగా టీఆర్ఎస్ ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా మహిళా నాయకులు తెలిపారు. కల్వకుంట్ల కవిత నాయకత్వంపై నమ్మకంతోనే పార్టీలో చేరుతున్నామని వారు పేర్కొన్నారు. మహిళా ఓటర్లలో పార్టీ ప్రభావం పెరుగుతోందనే సంకేతాలు ఈ చేరికల ద్వారా కనిపిస్తున్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గానికి చెందిన నర్సింహ తన అనుచరులతో కలిసి టీఆర్ఎస్‌లో చేరారు. అలాగే నర్సాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు యువకులు కూడా పార్టీలో చేరడం విశేషంగా మారింది. యువతకు రాజకీయ అవకాశాలు కల్పించే వేదికగా టీఆర్ఎస్ నిలుస్తోందని చేరిన యువకులు పేర్కొన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం కొత్త రాజకీయ ప్రత్యామ్నాయం అవసరమని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడిన పార్టీ చీఫ్ కల్వకుంట్ల కవిత, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం కోసం టీఆర్ఎస్ పనిచేస్తోందని పేర్కొన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించడమే పార్టీ ప్రధాన లక్ష్యమని చెప్పారు. రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను కలుపుకొని ముందుకు సాగుతామని ఆమె స్పష్టం చేశారు. పార్టీలో చేరిన ప్రతి కార్యకర్తకు సముచిత గుర్తింపు ఉంటుందని హామీ ఇచ్చారు. వివిధ నియోజకవర్గాల నుంచి వరుసగా చేరికలు కొనసాగుతుండటంతో తెలంగాణ రాజకీయాల్లో టీఆర్ఎస్ ప్రాధాన్యం పెరుగుతోందనే చర్చ మొదలైంది. ముఖ్యంగా యువత, మహిళలు, గ్రామస్థాయి నాయకులు పార్టీ వైపు మొగ్గుచూపడం రాజకీయంగా కీలక పరిణామంగా భావిస్తున్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని చేరికలు ఉండే అవకాశముందని పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

# పోలీసుల చేతుల్లోనే పోక్సో కేసు!

**కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి**

హైదరాబాద్, మే 17 (ఈవార్తలు): పోక్సో కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న బండి భగీరథ్ శనివారం పోలీసులకు లొంగిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలోనే గత కొన్ని రోజులుగా ఈ వ్యవహారంలో జరుగుతున్న హైడ్రామాలకు తెరపడింది. బండి భగీరథ్ ను అరెస్ట్ చేసిన పోలీసులు.. విచారణ జరిపి చర్లపల్లి జైలుకు తరలించారు. ఈ క్రమంలోనే బండి భగీరథ్ అరెస్ట్, పోక్సో కేసు విచారణకు సంబంధించి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి మాట్లాడారు. బండి భగీరథ్ పోలీసుల ముందు లొంగిపోయారని వెల్లడించారు. ఇక ఈ పోక్సో కేసులో విచారణ ఏదైనా ఉంటే అది.. పూర్తిగా తెలంగాణ రాష్ట్ర పోలీసుల పరిధిలో ఉంటుందని తేల్చి చెప్పారు. హైదరాబాద్ నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన కిషన్ రెడ్డి.. రాష్ట్ర ప్రభుత్వం స్వతంత్రంగా దర్యాప్తు చేసుకునే హక్కును కలిగి ఉంటుందని తెలిపారు. రాష్ట్ర పోలీసులు బండి భగీరథ్ కేసులో ఏ రకమైన విచారణ అయినా చేసుకోవచ్చని వెల్లడించారు. పశ్చిమ బెంగాల్ పర్యటనలో భాగంగా కేంద్రమంత్రి అమిత్ షా.. ఉత్తర్‌ప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌లను ఆ రాష్ట్ర పోలీసులు గతంలో అడ్డుకున్న విషయాన్ని ప్రస్తావించిన కిషన్ రెడ్డి.. రాష్ట్ర ప్రభుత్వానికి అంతటి స్వతంత్ర వ్యవస్థ ఉంటుందని స్పష్టం చేశారు. బండి భగీరథ్ విషయంలో పోలీసులు ఎలాంటి విచారణ అయిన చేయొచ్చని కిషన్‌రెడ్డి తేల్చిచెప్పారు. మరోవైపు.. రాష్ట్రంలో ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి.. రేవంత్ రెడ్డి సర్కార్‌పై కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ధాన్యం కొనుగోళ్లలో ప్రతి పైసాను కేంద్ర ప్రభుత్వమే ఇస్తోందని చెప్పిన కిషన్‌రెడ్డి.. మరి అలాంటప్పుడు రైతుల నుంచి ధాన్యాన్ని ఎందుకు కొనడం లేదని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. ధాన్యం కొనుగోళ్ల వ్యవహారంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలను అమలు చేయడం లేదని విమర్శించిన కిషన్ రెడ్డి.. సన్నవడ్లకు బోనస్ ఇవ్వడం లేదని ఆరోపించారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ధాన్యం కొనుగోళ్లు చేయడం లేదని.. అన్నదాతలు ధర్నాలు చేస్తున్నారన్న కేంద్రమంత్రి.. రాష్ట్ర ప్రభుత్వం వారికి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా రాష్ట్ర మంత్రులు.. అన్ని జిల్లాల్లో పర్యటించి.. ధాన్యం కొనుగోళ్లను పర్యవేక్షించాలని సూచించారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.


# భగీరథే లొంగిపోయాడు: న్యాయవాది

హైదరాబాద్, మే 17 (ఈవార్తలు): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్‌ను పోలీసులు అరెస్ట్ చేయలేదని, అతనే స్వయంగా లొంగిపోయాడని ఆయన తరఫు న్యాయవాది కరుణా సాగర్ స్పష్టం చేశారు. పోక్సో కేసులో నిందితుడిగా ఉన్న భగీరథ్‌కు మేజిస్ట్రేట్ 14 రోజుల జ్యుడీషియల్ కస్టడీ విధించిన కొన్ని గంటల తర్వాత ఆయన ఈ ప్రకటన చేశారు. స్వచ్ఛందంగా లొంగిపోవడాన్ని 'అరెస్ట్'గా చిత్రీకరించడం ద్వారా పోలీసులు ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారని ఆయన ఆరోపించారు. అయితే, సైబరాబాద్ పోలీసులు మాత్రం భగీరథ్‌ను అరెస్ట్ చేసినట్లు ప్రకటించారు. మే 16న రాత్రి 8:15 గంటలకు నార్సింగి పోలీస్ స్టేషన్ పరిధిలోని మంచిరేవుల టెక్ పార్క్ వద్ద పక్కా సమాచారంతో భగీరథ్‌ను అదుపులోకి తీసుకున్నామని తెలిపారు.




# బెర్ముడా ట్రయాంగిల్ గుట్టు తెలిసింది!

**సముద్ర పరిస్థితుల వల్లే ప్రమాదాలు**

**ఓడల అదృశ్యం వెనుక 'రోగ్ వేవ్స్' అలలే కారణం**

**బెర్ముడా దీవి కింద ప్రత్యేక రాతి పొర: శాస్త్రవేత్తలు**



న్యూఢిల్లీ: శతాబ్దాలుగా ప్రపంచాన్ని కలవరపెడుతున్న బెర్ముడా ట్రయాంగిల్ మిస్టరీకి సంబంధించిన కీలక విషయాలను శాస్త్రవేత్తలు వెల్లడించారు. అట్లాంటిక్ మహాసముద్రంలోని ఈ ప్రాంతంలో ఓడలు, విమానాలు అదృశ్యం కావడం వెనుక అతీంద్రియ శక్తులు ఉన్నాయనే వాదనలను తోసిపుచ్చుతూ, దీనికి కచ్చితమైన భూగర్భ, వాతావరణ కారణాలు ఉన్నాయని వివరిస్తున్నారు. ఫ్లోరిడా, బెర్ముడా, ప్యూర్టో రికో మధ్య విస్తరించి ఉన్న ఈ త్రికోణాకార ప్రాంతంలో జరిగే ప్రమాదాలకు ముఖ్య కారణం అక్కడి సముద్ర పరిస్థితులేనని నిపుణులు చెబుతున్నారు. ఓషనోగ్రాఫర్ సైమన్ బాక్సాల్, ఛానల్ 5 డాక్యుమెంటరీ 'ది బెర్ముడా ట్రయాంగిల్ ఎనిగ్మా'లో మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో 'రోగ్ వేవ్స్' అనే ఆకస్మిక, భీకరమైన అలలు ఏర్పడతాయని తెలిపారు. మూడు వేర్వేరు దిక్కుల నుంచి వాతావరణ వ్యవస్థలు ఇక్కడ కలవడం వల్ల సముద్రం అస్థిరంగా మారి, భారీ నౌకలను సైతం ముంచివేయగల శక్తివంతమైన అలలు పుట్టుకొస్తాయని ఆయన వివరించారు. మరోవైపు, బెర్ముడా దీవి ఉనికి కూడా ఒక శాస్త్రీయ అద్భుతమే. సాధారణంగా అగ్నిపర్వతాలు చల్లారిన తర్వాత దీవులు సముద్రంలో మునిగిపోతాయి. కానీ, 3 కోట్ల ఏళ్ల క్రితమే ఇక్కడ అగ్నిపర్వత కార్యకలాపాలు ఆగిపోయినా, బెర్ముడా దీవి ఇప్పటికీ సముద్ర మట్టానికి పైనే ఉంది. దీనిపై 'జియోఫిజికల్ రీసెర్చ్ లెటర్స్' పత్రికలో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం, దీవి కింద సుమారు 20 కిలోమీటర్ల మందంతో, తక్కువ సాంద్రత కలిగిన అగ్ని శిలల పొర ఉందని శాస్త్రవేత్తలు విలియం ఫ్రేజర్, జెఫ్రీ పార్క్ కనుగొన్నారు. ఈ భూగర్భ నిర్మాణమే ఒక రకమైన ఆధారంగా పనిచేస్తూ దీవిని తేలియాడేలా చేస్తోంది. ఈ శాస్త్రీయ వివరణల నేపథ్యంలో, బెర్ముడా ట్రయాంగిల్ చుట్టూ అల్లుకున్న అతీంద్రియ కథలకు ఎలాంటి ఆధారాలు లేవని, మానవ తప్పిదాలు, సంక్లిష్ట వాతావరణ పరిస్థితులే ప్రమాదాలకు కారణమని స్పష్టమవుతోంది.

# మనం అంటార్కిటికా వాసులమే!

**ఏపీ, అంటార్కిటికా ఒకప్పుడు ఒకే భూభాగం**

**విజయనగరం-సాలూరు రాళ్లలో బయటపడ్డ నిజం**

**రెండు ప్రాంతాల రాళ్లకు ఒకే భౌగోళిక చరిత్ర, లక్షణాలు**

**లక్షలాది సంవత్సరాల కిందట విడిపోయిన ఖండాలు**



న్యూఢిల్లీ: ఎక్కడ ఆంధ్రప్రదేశ్, ఎక్కడ మంచు ఖండం అంటార్కిటికా..! ఈ రెండింటి మధ్య సంబంధం ఏంటి అనుకుంటున్నారా? కోట్లాది సంవత్సరాల కిందట ఈ రెండు ప్రాంతాలు ఒకే భారీ భూభాగంలో భాగంగా ఉండేవని శాస్త్రవేత్తలు బలమైన ఆధారాలతో నిరూపించారు. విజయనగరం-సాలూరు ప్రాంతంలోని ప్రాచీన రాళ్లకు, తూర్పు అంటార్కిటికాలోని రేనర్ ప్రావిన్స్‌లో ఉన్న రాళ్లకు మధ్య విడదీయరాని సంబంధం ఉందని తాజా అధ్యయనంలో తేలింది. ఈ రెండు ప్రాంతాల రాళ్లు ఒకే వయస్సు, ఒకే రకమైన రసాయన లక్షణాలు, ఖనిజాలు కలిగి ఉండటమే ఇందుకు నిదర్శనం. భారత తూర్పు తీర ప్రాంతం, అంటార్కిటికా ఒకప్పుడు ఒకే భారీ పర్వత శ్రేణిగా (రేనర్-ఈస్టర్న్ ఘాట్స్) ఉండేవని భూగర్భ శాస్త్రవేత్తలు చాలాకాలంగా భావిస్తున్నారు. ఇప్పుడు, ఏపీలోని రాళ్లపై జరిపిన పరిశోధన ఈ వాదనకు నిర్ణయాత్మక ఆధారాన్ని అందించింది. కోల్‌కతాలోని ప్రెసిడెన్సీ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు, ఇతర అంతర్జాతీయ సంస్థల శాస్త్రవేత్తలతో కలిసి ఈ పరిశోధన చేశారు. విజయనగరంలోని గ్రాన్యులైట్ శిలల్లోని జిర్కాన్, గార్నెట్ వంటి ఖనిజాలను విశ్లేషించి ఈ నిర్ధారణకు వచ్చారు. ఈ రెండు ప్రాంతాల రాళ్లు మూడు ప్రధాన భౌగోళిక దశలను ఒకే విధంగా ఎదుర్కొన్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. సుమారు 1000 మిలియన్ సంవత్సరాల క్రితం, ఈ రాళ్లు భూమి లోపల అత్యధిక ఉష్ణోగ్రతకు గురై ఒక మహా పర్వత శ్రేణిగా ఏర్పడ్డాయి. ఆ తర్వాత 950-890 మిలియన్ సంవత్సరాల క్రితం మరోసారి తీవ్రమైన ఒత్తిడికి లోనయ్యాయి. ఇక 570-540 మిలియన్ సంవత్సరాల క్రితం గోండ్వానా మహా ఖండం ఏర్పడే సమయంలో రసాయన మార్పులు జరిగాయి. సరిగ్గా ఇదే రకమైన భౌగోళిక చరిత్ర అంటార్కిటికా రాళ్లలోనూ కనిపించింది. సుమారు 130-150 మిలియన్ సంవత్సరాల క్రితం గోండ్వానా ఖండం విడిపోయినప్పుడు, భారతదేశం ఉత్తరం వైపు, అంటార్కిటికా దక్షిణ ధ్రువం వైపు కదిలిపోయాయి. మధ్యలో హిందూ మహాసముద్రం ఏర్పడింది. వేల కిలోమీటర్ల దూరం వీటిని వేరు చేస్తున్నా, అక్కడి రాళ్లు, ఇక్కడి రాళ్లు తమ ప్రాచీన బంధాన్ని ఇంకా దాచుకున్నాయని శాస్త్రవేత్తలు వివరిస్తున్నారు. ఈ అధ్యయనం భూమి చరిత్రను, వనరుల నిర్వహణను అర్థం చేసుకోవడానికి ఎంతగానో ఉపయోగపడుతుందని వారు తెలిపారు.

## రష్యాపై డ్రోన్లతో ఉక్రెయిన్ దాడి

**భారతీయ కార్మికుడితో సహా నలుగురు మృతి**

మాస్కో: భారీ సంఖ్యలోని డ్రోన్లతో రష్యాపై ఉక్రెయిన్ దాడి చేసింది. భారతీయ కార్మికుడితో సహా నలుగురు మరణించారు. మరో ముగ్గురు భారతీయ కార్మికులు, మరి కొందరు గాయపడ్డారు. రష్యాలోని భారత రాయబార కార్యాలయం ఈ విషయాన్ని ధృవీకరించింది. దాడి జరిగిన ప్రదేశాన్ని అధికారులు సందర్శించారని, గాయపడిన కార్మికులను ఆసుపత్రిలో పరామర్శించినట్లు తెలిపింది. 'ప్రాణనష్టం పట్ల రాయబార కార్యాలయం సంతాపం వ్యక్తం చేస్తోంది. భారతీయ కార్మికులకు అవసరమైన సహాయం అందించడానికి కంపెనీ యాజమాన్యం, స్థానిక అధికారులతో కలిసి పనిచేస్తోంది' అని భారత రాయబార కార్యాలయం ఎక్స్ పోస్ట్‌లో పేర్కొంది. కాగా, ఆదివారం తెల్లవారుజామున రష్యాపై భారీ స్థాయిలో డ్రోన్ దాడులకు ఉక్రెయిన్ పాల్పడింది. రష్యా రాజధాని మాస్కోలోని కొన్ని ప్రాంతాలు, సమీప ప్రాంతాల్లో పేలుళ్లు సంభవించాయి. 24 గంటల వ్యవధిలో దేశవ్యాప్తంగా 1,000కు పైగా ఉక్రేనియన్ డ్రోన్‌లను అడ్డుకున్నట్లు రష్యా రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. మరోవైపు రాజధాని వైపు దూసుకొచ్చిన సుమారు 81 డ్రోన్‌లను వాయు రక్షణ వ్యవస్థలు కూల్చివేశాయని మాస్కో మేయర్ సెర్గీ సోబియానిన్ తెలిపారు. ఈ దాడుల వల్ల పలు ప్రాంతాల్లోని నివాస భవనాలు, మౌలిక సదుపాయాలకు నష్టం వాటిల్లినట్లు చెప్పారు. నలుగురు మరణించారని, వీరిలో ముగ్గురు మాస్కో ప్రాంతానికి చెందినవారని అధికారులు తెలిపారు. ఉక్రెయిన్ సరిహద్దు సమీపంలోని బెల్గోరోడ్ ప్రాంతంలో మరో మరణం నమోదైనట్లు వెల్లడించారు.

## ఏయ్ అంటే.. ఓయ్ అంటోంది!

**ఇరాన్‌కు అమెరికా ఐదు షరతులు.. ప్రతిగా అమెరికాకు ఇరాన్ షరతులు**

వాషింగ్టన్/టెహ్రాన్: అమెరికా-ఇరాన్ అణు చర్చలు మరింత ఉద్రిక్తతకు దారితీశాయి. ఇరాన్‌కు అమెరికా ఐదు కీలక షరతులను విధించింది. వాటిలో ప్రధానంగా 400 కిలోల యురేనియం అమెరికాకు అప్పగించాలి. ఇరాన్‌లో ఒక్క అణు కేంద్రం మాత్రమే కొనసాగాలి. గత ఆంక్షల వల్ల కలిగిన నష్టాలకు ఎటువంటి పరిహారం ఇవ్వబోం. విదేశాల్లో స్తంభించిన ఇరాన్ ఆస్తుల్లో 25 శాతం కూడా విడుదల చేయదు. అలాగే వివిధ యుద్ధ రంగాల్లో శాంతి కొనసాగింపుపై చర్చలు జరగాలి అని స్పష్టం చేసింది. ఈ డిమాండ్లపై ఇరాన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బదులుగా, ఇరాన్ తన షరతులను ప్రకటించింది. లెబనాన్ సహా అన్ని యుద్ధ రంగాల్లో శాంతి కొనసాగించాలి. అన్ని ఆంక్షలను తొలగించాలి. విదేశాల్లో స్తంభించిన నిధులను విడుదల చేయాలి. యుద్ధ నష్టాలకు పరిహారం ఇవ్వాలి. అలాగే హర్మూజ్ జలసంధిపై తమ సార్వభౌమాధికారాన్ని గుర్తించాలి అని తెలిపింది. ఇరాన్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి ఎస్మాయిల్ బకాయి మాట్లాడుతూ.. అమెరికా-ఇజ్రాయెల్‌లు శాంతి పేరుతో యుద్ధాన్ని కొనసాగిస్తున్నారని ఆరోపించారు. సంక్షోభాన్ని సృష్టించి, దాన్ని శాంతి పేరుతో మరింత పెంచడం అమెరికా-ఇజ్రాయెల్‌ల పాత పద్ధతి అని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు, ఇరాన్ పార్లమెంట్ స్పీకర్ హెచ్చరించారు. తమ ప్రతిపాదనలకు అమెరికా అంగీకరించకపోతే ఆ దేశ చెల్లింపు దారులు భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని అన్నారు. ఫిబ్రవరి 28న అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు ఇరాన్‌ను తీవ్రంగా కుదిపేశాయి. ప్రతిగా, ఇరాన్ హర్మూజ్ జలసంధి మార్గాలను అడ్డుకోవడంతో ప్రపంచ ఇంధన సరఫరా దెబ్బతింది.

## అధికారిక నివాసానికి సీఎం

**బెంగాల్‌లో ఆసక్తికర పరిణామం**

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో ఒక ఆసక్తికర పరిణామం చోటుచేసుకోనుంది. సుమారు 25 ఏళ్ల సుదీర్ఘ విరామం తర్వాత రాష్ట్ర ముఖ్యమంత్రి అధికారిక నివాసానికి మారే అవకాశాలు కనిపిస్తున్నాయి. బీజేపీ ప్రభుత్వ నూతన ముఖ్యమంత్రి సువేందు అధికారి కోసం కోల్‌కతాలోని అలీపూర్ ప్రాంతంలో ఉన్న 'సౌజన్య' అనే ప్రభుత్వ భవనాన్ని అధికారులు సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర పబ్లిక్ వర్క్స్ డిపార్ట్‌మెంట్ ఈ మేరకు ఏర్పాట్లు చేస్తోంది. గతంలో ముఖ్యమంత్రిగా పనిచేసిన జ్యోతి బసు సాల్ట్ లేక్‌లోని 'ఇందిరా భవన్' అనే అధికారిక నివాసంలో ఉండేవారు. ఆయన తర్వాత ముఖ్యమంత్రులైన బుద్ధదేవ్ భట్టాచార్య, మమతా బెనర్జీ మాత్రం తమ సొంత ఇళ్లలోనే నివసించారు. దీంతో పాతికేళ్లుగా బెంగాల్‌కు అధికారిక సీఎం హౌస్ లేకుండా పోయింది. ఇప్పుడు సువేందు అధికారి ఆ సంప్రదాయానికి తెరదించున్నారని తెలుస్తోంది. ప్రస్తుతం సువేందు అధికారి కోల్‌కతాలోని చైనార్ పార్క్‌లో ఒక ఫ్లాట్‌లో నివసిస్తున్నారు. అయితే ఆ ప్రాంతం భద్రతాపరంగా అంత సురక్షితం కాదని నిఘా వర్గాలు హెచ్చరించాయి. ఈ నేపథ్యంలోనే అధికారులు అత్యంత భద్రత, అన్ని సౌకర్యాలు ఉన్న 'సౌజన్య' భవనాన్ని ఎంపిక చేశారు. విశేషమేమిటంటే, ఈ భవనం భవానీపూర్ నియోజకవర్గంలోనే ఉంది. ఇటీవలి ఎన్నికల్లో సువేందు ఇదే నియోజకవర్గంలో మమతా బెనర్జీపై విజయం సాధించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో నిర్మించిన ఈ గెస్ట్ హౌస్‌ను 2018లో మమతా బెనర్జీనే ప్రారంభించారు. ఈ ప్రతిపాదనకు సువేందు అధికారి ఇంకా అంగీకారం తెలపాల్సి ఉంది. ఆయన ఒప్పుకుంటే, 'సౌజన్య' బెంగాల్ కొత్త సీఎం హౌస్‌గా మారుతుంది.

## మళ్లీ పెరిగిన సీఎన్‌జీ ధరలు

న్యూఢిల్లీ: వాహనదారులపై ఇంధన భారం మరింత పెరిగింది. సీఎన్‌జీ ధరలను కేంద్రం మరోసారి పెంచింది. కేజీకి ఒక రూపాయి చొప్పున పెంచుతూ నిర్ణయం తీసుకుంది. రెండు రోజుల వ్యవధిలో సీఎన్‌జీ ధరలు రెండోసారి పెరిగాయి. శుక్రవారం కూడా కేజీ గ్యాస్‌పై రూ.2 చొప్పున పెంచారు. దీంతో మూడు రోజుల వ్యవధిలో సీఎన్‌జీ వాహనదారులపై రూ.3 అదనపు భారం పడినట్లయింది. తాజా పెంపుతో దేశ రాజధాని ఢిల్లీలో సీఎన్‌జీ ధర కేజీ రూ.80.09కి చేరింది. నోయిడా-గాజియాబాద్ ప్రాంతంలో ఈ రేటు రూ.88.70గా నమోదైంది.

# మోదీకి స్వీడన్ యుద్ధ విమానాల ఎస్కార్ట్





గోతెన్‌బర్గ్: ప్రధాని నరేంద్ర మోదీ ఐదు దేశాల యూరప్ పర్యటనలో భాగంగా స్వీడన్‌లోని గోతెన్‌బర్గ్ చేరుకున్నారు. విమానాశ్రయంలో మోదీకి స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టర్సన్ ఘన స్వాగతం పలికారు. ఈ పర్యటనకు ఉన్న భౌగోళిక రాజకీయ ప్రాధాన్యాన్ని సూచిస్తూ స్వీడన్ గగనతలంలోకి ప్రధాని మోదీ విమానం ప్రవేశించిన సమయంలో ఆ దేశ గ్రిపెన్ యుద్ధ విమానాలు భద్రత కల్పించాయి. గ్రిపెన్ యుద్ధ విమానం గగనతల రక్షణ, శత్రు లక్ష్యాలపై దాడులు, గూఢచారి సమాచార సేకరణ వంటి పలు విధుల్లో ఉపయోగపడుతుంది. అత్యాధునిక రాడార్ వ్యవస్థలు, ఎలక్ట్రానిక్ యుద్ధ సాంకేతికత, క్షిపణి దాడి సామర్థ్యాలు ఇందులో ఉన్నాయి. ఈ విమానాలకు వేగంగా టేకాఫ్ తీసుకోవడం, చిన్న రన్‌వేలపై కూడా పనిచేయడం వంటి ప్రత్యేకతలు ఉన్నాయి. అత్యవసర పరిస్థితుల్లో హైవేలపై నుంచి కూడా ఆపరేట్ చేసేలా దీనిని రూపొందించారు. గ్రిపెన్‌లో అధునాతన డేటా లింక్ వ్యవస్థ ఉంది. దీని ద్వారా ఇతర యుద్ధ విమానాలు, ఆర్మీ, రాడార్ కేంద్రాలతో వేగంగా సమాచార మార్పిడి జరుగుతుంది. స్వీడన్ నేలపై అడుగుపెట్టిన ప్రధాని మోదీ.. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్, నెదర్లాండ్స్ పర్యటనల్లో కీలక దౌత్య కార్యక్రమాలు పూర్తి చేసి వచ్చిన ఉత్సాహంతో కనిపించారు. స్వీడన్ ప్రధాని ఉల్ఫ్ క్రిస్టర్సన్ ఆహ్వానం మేరకు ప్రధాని మోదీ మే 17-18 తేదీల్లో స్వీడన్‌లో పర్యటిస్తున్నారు. ఈ రెండు రోజుల కీలక పర్యటన ద్వైపాక్షిక సంబంధాల్లో కొత్త మార్పులకు దారి తీసే అవకాశం ఉంది. వాణిజ్యం, సాంకేతిక ఆవిష్కరణలు, గ్రీన్ టెక్నాలజీలు, అభివృద్ధి చెందుతున్న రంగాలకు కొత్త ఊపు ఇవ్వనుంది. ఈ సమావేశాన్ని కీలక దౌత్య ఘట్టంగా భావిస్తున్నారు. ఎన్నో ఏళ్ల విరామం తర్వాత భారత ప్రధాని నార్డిక్ (ఉత్తర యూరప్ ప్రాంతంలో ఉన్న దేశాల సమూహం) దేశంలో పర్యటన చేపడుతున్నారు. నార్డిక్ దేశాల్లో స్వీడన్, నార్వే, డెన్మార్క్, ఫిన్లాండ్, ఐస్‌లాండ్ దేశాలు ఉంటాయి. "2018లో జరిగిన తొలి ఇండియా-నార్డిక్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు ప్రధాని గతంలో స్వీడన్ పర్యటించారు" అని విదేశాంగ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ పర్యటనలో ప్రధాని మోదీ, ప్రధాని క్రిస్టర్సన్‌తో ద్వైపాక్షిక చర్చలు నిర్వహించనున్నారు. భారత్-స్వీడన్ సంబంధాలన్నింటినీ సమీక్షించి కీలక రంగాల్లో కొత్త సహకార అవకాశాలను గుర్తించనున్నారు. ఈ ఉన్నతస్థాయి చర్చలు భారత్, స్వీడన్ మధ్య ఆర్థిక, వాణిజ్య సత్సంబంధాన్ని మరింత బలోపేతం చేసే అవకాశముంది. సాంప్రదాయ వాణిజ్య రంగాలకే పరిమితం కాకుండా.. గ్రీన్ మార్పు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, అభివృద్ధి చెందుతున్న సాంకేతిక రంగాలు, స్టార్టప్‌లు, సరఫరా వ్యవస్థల బలోపేతం, రక్షణ తయారీ, అంతరిక్ష సహకారం, వాతావరణ చర్యలు, ప్రజల మధ్య సంబంధాల బలోపేతంపై కూడా చర్చలు జరగనున్నాయి. ఆవిష్కరణల ఆధారిత ఆర్థిక వ్యవస్థల్లో యూరప్‌లో ప్రముఖ దేశంగా స్వీడన్‌కు గుర్తింపు ఉంది. భవిష్యత్ రంగాల్లో వ్యూహాత్మక సహకారాన్ని విస్తరించేందుకు ఇరు దేశాలు ప్రయత్నిస్తున్నాయి.

# కాంగోలో ఎబోలా విజృంభణ

**ఇప్పటి వరకు 87 మంది మృతి**

**అత్యవసర పరిస్థితి ప్రకటించిన డబ్ల్యూహెచ్‌ఓ**




కిన్షాషా: కాంగోలో ఎబోలా వైరస్ వ్యాప్తితో ప్రపంచ ఆరోగ్య సంస్థ అప్రమత్తమైంది. డెమొక్రటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగో, ఉగాండాలో ఎబోలా యొక్క అరుదైన 'బుండిబుగ్యో' రకం వ్యాపిస్తోంది. దీంతో పదుల సంఖ్యలో ప్రాణాలు కోల్పోయారు. దీంతో అప్రమత్తమైన ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌ఓ) అంతర్జాతీయ ఆరోగ్య అత్యవసర పరిస్థితిని ప్రకటించింది. ఈ మేరకు జెనీవాలోని డబ్ల్యూహెచ్‌ఓ కార్యాలయం ఆదివారం ఓ ప్రకటన విడుదల చేసింది. అయితే ఈ వైరస్‌ను మహమ్మారిగా ప్రకటించలేదు. కాంగోలోని ఈస్టర్న్ ఇటూరి ప్రావిన్స్‌లో ఇటీవలి కాలంలో ఎబోలా కేసులు, మరణాల సంఖ్య పెరుగుతూ ఉండటం ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో స్క్రీనింగ్, కాంటాక్ట్ ట్రేసింగ్ చేపడుతున్నారు. అటు ఎబోలా వైరస్ వ్యాప్తి కారణంగా 87 మంది చనిపోయినట్లు ఆఫ్రికా సీడీసీ శనివారం ప్రకటించింది. అలాగే ఈ వైరస్ చాలా వేగంగా విస్తరిస్తున్నట్లు హెచ్చరించింది. మరోవైపు శుక్రవారం నాటికి 65 మంది చనిపోయారని.. 246 అనుమానిత కేసులు నమోదైనట్లు అధికారులు తెలిపారు. అయితే శనివారం నాటికి అనుమానిత కేసుల సంఖ్య 336కు పెరిగింది. ఇందులో 13 మందికి ఎబోలా వైరస్ సోకినట్లు నిర్ధరించారు. వీరిలో నలుగురు చనిపోయారు. ఎబోలా వైరస్ రక్తం, వాంతులు, వీర్యం వంటి శరీర ద్రవాల ద్వారా ఒకరి నుంచి ఇతరులకు సోకుతుందని వైద్యులు చెప్తున్నారు. ఇది ప్రాణాంతకమైనదని హెచ్చరిస్తున్నారు. తాజాగా విస్తరిస్తున్న వైరస్ కాంగోలోని ఓ గనుల ప్రాంతంలో మొదలైంది. అక్కడి నుంచి ఈ వైరస్ ఇతర ప్రాంతాలకు వ్యాపించింది. ఇటూరి ప్రావిన్స్‌లోని మోంగ్ వాలు హెల్త్ జోన్‌లో తొలుత కేసులు వెలుగు చూసినట్లు ఆఫ్రికా సీడీసీ అధికారులు చెప్తున్నారు. అక్కడి నుంచి ర్వాంప్ వారా, బునియా ప్రాంతాలు వ్యాపించాయని వెల్లడించారు. ఇప్పటి వరకూ చనిపోయిన 87 మందిలో మోంగ్వాలు ప్రాంతంలో 57 మంది, ర్వాంప్వారాలో 27 మంది.. బునియాలో ముగ్గురు చనిపోయినట్లు తెలిపారు. వ్యాధి సోకిన వారిలో చాలామంది ఇప్పటికీ ప్రజల మధ్యలోనే ఉన్నారని.. దీంతో వారి కాంటాక్టులను గుర్తించి, వ్యాప్తిని అరికట్టడం కష్టతరం అవుతోందని అధికారులు చెప్తున్నారు. ఇటూరిలో ఇస్లామిక్ స్టేట్ మద్దతు ఉన్న మిలిటెంట్లు దాడులు కొనసాగుతుండటంతో వైరస్ కాంటాక్టులను గుర్తించడటం కూడా కష్టం ఉందంటున్నారు. మరోవైపు 1976లో తొలిసారిగా కాంగోలో ఎబోలా వైరస్ వెలుగుచూసింది.

### రూ.10 లక్షలకు నీట్ పేపర్ కొంటే..

# 720కి 107 మార్కులొచ్చాయి!

సికార్: దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్-యూజీ 2026 పేపర్ లీకేజీ కేసు దర్యాప్తులో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వస్తున్నాయి. ఈ కేసును విచారిస్తున్న కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) రాజస్థాన్‌లోని సికార్ జిల్లాపై పూర్తిస్థాయిలో దృష్టి సారించింది. తాజాగా ఈ కుంభకోణంతో సంబంధం ఉన్న ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురిని సీబీఐ అధికారులు అరెస్ట్ చేశారు. దినేశ్ బివాల్, అతని సోదరుడు మంగీలాల్ బివాల్, మంగీలాల్ పెద్ద కుమారుడు వికాస్‌ను అదుపులోకి తీసుకున్నారు. నీట్ అసలు ప్రశ్నపత్రాన్ని పోలిన ఒక 'గెస్ పేపర్'ను నిందితులు సంపాదించి, కోచింగ్ సెంటర్లకు సరఫరా చేసినట్లు సీబీఐ అధికారులు గుర్తించారు. అక్కడి నుంచి ఈ పేపర్ పలువురు అభ్యర్థులకు చేరినట్లు దర్యాప్తులో తేలింది. ఈ కేసులో ప్రధాన నిందితుడిగా ఉన్న దినేశ్ బివాల్ కుమారుడు రిషి బివాల్ కోసం సీబీఐ గాలిస్తోంది. తన కొడుకు రిషిని డాక్టర్‌ను చేయాలనే ఉద్దేశంతో దినేశ్ సుమారు రూ. 10 లక్షలు చెల్లించి లీకైన పేపర్‌ను సికార్‌లో కొనుగోలు చేసినట్లు విచారణలో అంగీకరించినట్టు సమాచారం. అయితే, పరీక్షకు ముందే పేపర్ చేతికి అందినప్పటికీ రిషి నీట్‌లో 720 మార్కులకు గాను కేవలం 107 మార్కులు మాత్రమే సాధించడం గమనార్హం. ప్రస్తుతం రిషి పరారీలో ఉన్నాడు. దర్యాప్తులో రిషి అకడమిక్ రికార్డును పరిశీలించగా అతడు చదువులో చాలా వెనుకబడినట్లు తేలింది. 10వ తరగతిలో కేవలం 44 శాతం మార్కులు సాధించిన రిషి.. 12వ తరగతిలో గ్రేస్ మార్కులతో సెకండ్ డివిజన్‌లో (50.80%) పాసయ్యాడు. ముఖ్యంగా ఫిజిక్స్, కెమిస్ట్రీ థియరీ పరీక్షల్లో చాలా తక్కువ మార్కులు వచ్చాయి. అయినప్పటికీ, అతడిని మెడికల్ ఎంట్రన్స్ పరీక్షకు సిద్ధం చేయడం కోసం కుటుంబం ఈ అడ్డదారిని ఎంచుకుంది. ఈ లీకేజీ నెట్‌వర్క్ కార్యకలాపాలకు సికార్‌లోని ఒక ఫ్లాట్‌ను సమన్వయ కేంద్రంగా ఉపయోగించినట్లు అధికారులు గుర్తించారు. నెట్‌వర్క్‌లోని కొంతమంది సభ్యులు కొరియర్లుగా వ్యవహరించి లీకైన పేపర్లను అభ్యర్థులకు నేరుగా చేరవేసినట్లు తేలింది. అరెస్ట్ అయిన దినేశ్, అతడి కుటుంబ సభ్యులు కూడా ఈ కొరియర్ పాత్ర పోషించినట్లు సీబీఐ అనుమానిస్తోంది.



## గోవా బీచ్‌ల్లో తగ్గిన విదేశీయుల సందడి

పనాజీ: భారతదేశపు 'పార్టీ క్యాపిటల్'గా ప్రపంచవ్యాప్తంగా పేరుగాంచిన గోవాకు విదేశీ పర్యాటకుల తాకిడి గణనీయంగా తగ్గుతోంది. ఒకప్పుడు యూరోపియన్లు, రష్యన్లతో కళకళలాడిన గోవా బీచ్‌లు ఇప్పుడు ఎక్కువగా దేశీయ పర్యాటకులతో నిండిపోతున్నాయి. ఈ మార్పు స్థానిక పర్యాటక రంగంపై తీవ్ర ప్రభావం చూపుతోంది. గోవా పర్యాటక శాఖ గణాంకాల ప్రకారం, 2017లో సుమారు 9 లక్షల మంది విదేశీ పర్యాటకులు రాగా, 2025 నాటికి ఆ సంఖ్య 5 లక్షలకు పడిపోయింది. మరోవైపు, దేశీయ పర్యాటకుల సంఖ్య 2016లో 68 లక్షల నుంచి గత ఏడాది నాటికి కోటి మార్కును దాటింది. విదేశీ పర్యాటకులు తగ్గడానికి పలు అంతర్జాతీయ, స్థానిక కారణాలు దోహదం చేస్తున్నాయి. ఉక్రెయిన్-రష్యా యుద్ధం, మధ్యప్రాచ్య ఉద్రిక్తతల కారణంగా విమాన టిక్కెట్ల ధరలు విపరీతంగా పెరిగాయి. దీనికి తోడు, శ్రీలంక, వియత్నామ్, థాయ్‌లాండ్ వంటి దేశాలు చౌక ధరలు, సులభమైన వీసా విధానాలతో గట్టిపోటీ ఇస్తున్నాయి. స్థానికంగా కూడా అనేక సమస్యలు విదేశీయులను దూరం చేస్తున్నాయి. వీసా నిబంధనలు కఠినతరం కావడం, ఫీజులు పెరగడం ఒక కారణమైతే, లండన్-గోవా డైరెక్ట్ ఫ్లైట్ రద్దు కావడం కూడా ప్రతికూలంగా మారింది. యాప్ ఆధారిత ట్యాక్సీ సేవలను స్థానిక యూనియన్లు వ్యతిరేకించడంతో అధిక ఛార్జీలు, ట్యాక్సీల లభ్యత లేకపోవడం పర్యాటకులకు పెద్ద తలనొప్పిగా మారింది. బీచ్‌లకు వెళ్లే దారుల్లో చెత్త, పరిశుభ్రత లోపం వంటివి కూడా వారిని నిరుత్సాహపరుస్తున్నాయి. విదేశీ పర్యాటకులు ఎక్కువ రోజులు బస చేసి, అధికంగా ఖర్చు చేస్తారని, వారి సంఖ్య తగ్గడం వల్ల స్థానిక ఆర్థిక వ్యవస్థపై ప్రభావం పడుతోందని హోటల్ యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిపై స్పందించిన గోవా పర్యాటక మంత్రి రోహన్ ఖాంటే, ప్రపంచ భౌగోళిక రాజకీయ పరిస్థితులే దీనికి కారణమని, పర్యాటకులను తిరిగి ఆకర్షించేందుకు పోలాండ్, స్కాండినేవియా దేశాల్లో రోడ్ షోలు నిర్వహిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో ఆసియా, ఆఫ్రికా మార్కెట్లపై కూడా దృష్టి సారిస్తామని ఆయన వివరించారు. 1960ల నాటి హిప్పీ సంస్కృతి నుంచి 'సుసేగాడ్' (నెమ్మదైన జీవనశైలి)తో ఆకట్టుకున్న గోవా, ఇప్పుడు తన ప్రాభవాన్ని నిలుపుకోవాలంటే తీవ్రంగా శ్రమించాల్సిన పరిస్థితి ఏర్పడింది.




## గురుకులాలకు ఆర్థిక భరోసా

### నెలనెలా నిధుల విడుదల

### రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం

హైదరాబాద్, మే 17 (ఈవార్తలు): రాష్ట్రంలోని గురుకులాలు, ప్రభుత్వ వసతి గృహ పాఠశాలల నిర్వహణలో ఎదురవుతున్న ఆర్థిక సమస్యలకు ప్రభుత్వం కీలక పరిష్కారం చూపింది. డైట్ చార్జీలు, కాస్మెటిక్స్ ఖర్చులు, భవన అద్దెలను ఇకపై ప్రతి నెలా సకాలంలో విడుదల చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు ప్రభుత్వం రూ.221.24 కోట్ల నిధులను మంజూరు చేసింది. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ సంక్షేమం, విద్యాశాఖల పరిధిలోని గురుకులాలు, వసతి గృహ పాఠశాలలు చాలా కాలంగా నిధుల కొరతతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ముఖ్యంగా డైట్ చార్జీలు, భవన అద్దెలు, కాస్మెటిక్స్ ఖర్చుల చెల్లింపుల్లో తీవ్ర ఆలస్యం జరగడంతో హాస్టళ్ల నిర్వహణపై ప్రభావం పడేది. ఈ సమస్యలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఇప్పుడు నెలవారీ చెల్లింపుల విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించింది. గతంలో ఈ చెల్లింపులు 8 నుంచి 9 నెలల వరకు ఆలస్యమయ్యేవి. దీంతో విద్యార్థులకు సరైన ఆహారం, వసతి కల్పించడంలో నిర్వాహకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఈ సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖ మంత్రి భట్టి విక్రమార్క ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. మొదట త్రైమాసిక చెల్లింపుల విధానాన్ని ప్రవేశపెట్టి, ఇప్పుడు దాన్ని నెలవారీ చెల్లింపుల విధానంగా మార్చారు. 2026–27 బడ్జెట్ సందర్భంగా ఈ కీలక నిర్ణయాన్ని ప్రకటించడం గమనార్హం. ప్రభుత్వం తీసుకున్న కొత్త నిర్ణయం ప్రకారం వివిధ సంక్షేమ, విద్యాశాఖల పరిధిలోని నివాస విద్యాసంస్థల కోసం మొత్తం రూ.221.24 కోట్ల నిధులను విడుదల చేసింది. ఈ నిధులతో ఆహార వ్యయాలు, కాస్మెటిక్స్ ఖర్చులు, భవన అద్దెల చెల్లింపులు సకాలంలో జరగనున్నాయి. ఫలితంగా విద్యార్థులకు నిరంతరాయంగా పోషకాహారం అందే అవకాశం ఏర్పడింది. అలాగే హాస్టళ్ల నిర్వహణ కూడా మరింత మెరుగుపడనుంది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల సామాజికంగా వెనుకబడిన వర్గాల విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి సదుపాయాలు లభించనున్నాయి. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలకు చెందిన పేద విద్యార్థులకు ఇది పెద్ద ఊరటనివ్వనుంది. విద్యార్థులు చదువుపై పూర్తిగా దృష్టి పెట్టేలా సౌకర్యాలు కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు చెబుతున్నారు. నెలవారీ నిధుల విడుదలతో గురుకులాలు, హాస్టళ్లలో విద్యా వాతావరణం మరింత మెరుగుపడే అవకాశముంది. విద్యార్థులకు నాణ్యమైన ఆహారం, పరిశుభ్రమైన వసతి, అవసరమైన సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి. దీని వల్ల విద్యార్థుల విద్యా ఫలితాలు కూడా మెరుగుపడతాయని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం గురుకుల విద్యా వ్యవస్థకు కొత్త బలాన్ని ఇచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

## పెట్రో వాహనాలపై భారీగా టోల్

### తిరుమలలో విధింపుపై టీటీడీ యోచన

### ఈవీల ప్రోత్సాహమే ప్రధాన లక్ష్యం




తిరుమల, మే 17 (ఈవార్తలు): తిరుమల పవిత్రతను కాపాడుతూ, పర్యావరణ హితమైన ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) భారీ సంస్కరణలకు శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా తిరుమల కొండపైకి వెళ్లే పెట్రోల్, డీజిల్ వాహనాలపై భారీగా టోల్ ఫీజు విధించాలని యోచిస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాలకు (ఈవీ) ప్రోత్సాహం కల్పించడంతో పాటు, అలిపిరి వద్దే రూ.500 కోట్లతో ఒక భారీ టౌన్‌షిప్‌ను నిర్మించాలని ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఈ మేరకు టీటీడీ ఈవో ఎం. రవిచంద్ర కీలక వివరాలను వెల్లడించారు. ప్రస్తుతం రోజుకు సగటున 8,000 వాహనాలు తిరుమలకు వస్తుండటంతో పర్యావరణ, శబ్ద కాలుష్యం పెరుగుతోందని రవిచంద్ర తెలిపారు. దీన్ని నివారించేందుకు ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించాలనే లక్ష్యంతో పెట్రోల్, డీజిల్ వాహనాలపై భారీ టోల్ విధించనున్నారు. అయితే, ఈ నిర్ణయం వెంటనే అమలులోకి రాదని, భక్తులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. ఎలక్ట్రిక్ వాహనాలకు టోల్ ఫీజు నుంచి మినహాయింపు ఇచ్చి, వాటి కోసం ప్రత్యేకంగా చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. ఈ ప్రణాళికలో మరో కీలకమైన అంశం అలిపిరి వద్ద రూ.500 కోట్ల వ్యయంతో భారీ టౌన్‌షిప్ నిర్మాణం. సుమారు 150 ఎకరాల్లో నిర్మించే ఈ టౌన్‌షిప్‌లో వసతి, పార్కింగ్, భోజన సౌకర్యాలు, పూజా సామగ్రి వంటి అన్ని సదుపాయాలు కల్పించనున్నారు. "దీన్ని తిరుమల కొండ దిగువ భాగంలో అభివృద్ధి చేస్తాం" అని ఈవో తెలిపారు. భక్తులు ఇక్కడే తమ మొక్కులు తీర్చుకుని, ఆ తర్వాత దర్శనం కోసం కొండపైకి వెళ్లేలా ఏర్పాట్లు చేయనున్నారు. వీటితో పాటు, తిరుమలను కఠినంగా 'సైలెన్స్ జోన్'గా అమలు చేసి, శబ్ద కాలుష్యాన్ని 80 శాతం వరకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. రూ.100 కోట్లతో అన్నదానం వంటశాలను ఆధునికీకరించడం, క్యూలైన్లకు బదులు భక్తులను నేరుగా అన్నదానం హాల్స్‌కు పంపడం వంటి చర్యలు కూడా చేపట్టనున్నారు. ఈ సంస్కరణల ద్వారా భక్తులను నిరుత్సాహపరచడం కాదని, వారి దర్శనాన్ని మరింత ప్రశాంతంగా, ఆధ్యాత్మికంగా మార్చడమే తమ ఉద్దేశమని ఈవో రవిచంద్ర వివరించారు.

## ఏపీలో వితంతువులకు కొత్త పింఛన్లు

విజయవాడ, మే 17 (ఈవార్తలు): ఏపీలోని వితంతువులకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా జూన్ 12వ తేదీ నుంచి కొత్తగా పింఛన్లు మంజూరు చేయనున్నట్లు రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ప్రకటించారు. శ్రీకాకుళం జిల్లా నిమ్మాడలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ప్రజాదర్బార్‌లో ఆయన ఈ కీలక ప్రకటన చేశారు. ఈ సందర్భంగా మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ, అర్హులైన లబ్ధిదారులు త్వరలోనే ఆన్‌లైన్‌లో తమ పేర్లను నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తామని తెలిపారు. ప్రజల నుంచి అర్జీలు స్వీకరించిన అనంతరం ఆయన అధికారులతో మాట్లాడారు. గత ప్రభుత్వ వైఫల్యాల వల్ల అనేక రెవెన్యూ సమస్యలు పేరుకుపోయాయని, వాటిని పరిష్కరించేందుకు అధికారులు వెంటనే చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా సమస్యలను త్వరితగతిన పరిష్కరించడమే తమ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లారు.



ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి సరస్వతి అంత్య పుష్కరాలకు ఆహ్వానిస్తున్న మంత్రి కొండా సురేఖ. ఈ నెల 21 నుంచి జూన్ 1 వరకు జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం కాళేశ్వరంలో " సరస్వతి అంత్య పుష్కరాలు" జరగనున్నాయి. ఈ నేపథ్యంలో సీఎంను ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేం నరేందర్ రెడ్డి, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజ రామయ్యర్, కమిషనర్ హనుమంతరావు, శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి దేవస్థానం ఈవో మహేశ్, ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ విద్యకు కొత్త దిశ

### కార్పొరేట్ స్థాయి బోధనపై ప్రభుత్వం ఫోకస్.. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ వెల్లడి

జగిత్యాల బ్యూరో, మే 17 (ఈవార్తలు): ప్రభుత్వ పాఠశాలల్లోనే ప్రైవేట్, కార్పొరేట్ స్థాయి విద్యను అందించడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. విద్య ద్వారానే సమాజ అభివృద్ధి సాధ్యమని పేర్కొంటూ ప్రభుత్వ విద్యా వ్యవస్థలో భారీ మార్పులు తీసుకొస్తున్నామని వెల్లడించారు. జగిత్యాలలో నిర్వహిస్తున్న ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా విద్యా వారోత్సవాలు ఘనంగా జరిగాయి. పాఠశాల విద్యాశాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందన సభ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ హాజరయ్యారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, అధికారులు పెద్ద సంఖ్యలో పాల్గొనడంతో కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వ విద్యా వ్యవస్థలో పలు కీలక సంస్కరణలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. పేద విద్యార్థులకు కూడా కార్పొరేట్ స్థాయి విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులు మెరుగుపరచడం, ఉపాధ్యాయుల కొరత లేకుండా చర్యలు తీసుకోవడం, విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్లు వివరించారు. వచ్చే విద్యా సంవత్సరం నుంచి రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉదయం అల్పాహార పథకాన్ని ప్రవేశపెట్టనున్నట్లు మంత్రి వెల్లడించారు. విద్యార్థులు ఆరోగ్యంగా, శారీరకంగా దృఢంగా ఉంటేనే చదువులో మెరుగైన ఫలితాలు సాధించగలరని ప్రభుత్వం భావిస్తోందన్నారు. ఇప్పటికే మధ్యాహ్న భోజన పథకం అమలులో ఉండగా, ఇప్పుడు అల్పాహారం కూడా అందించడం ద్వారా విద్యార్థుల ఆరోగ్యానికి మరింత భరోసా కల్పించనున్నట్లు తెలిపారు. విద్య ద్వారానే సమాజ వికాసం సాధ్యమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావిస్తున్నారని మంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులు కష్టపడి చదివి మంచి ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ విద్యపై ప్రజల్లో విశ్వాసం పెంచే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కూడా నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. జగిత్యాల జిల్లా పదో తరగతి ఫలితాల్లో 98.88 శాతం ఉత్తీర్ణత సాధించి రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలవడం గర్వకారణమని మంత్రి తెలిపారు. ఈ విజయానికి కృషి చేసిన జిల్లా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులను ప్రత్యేకంగా అభినందించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు కూడా ప్రతిభలో ఎక్కడా తగ్గడం లేదని ఈ ఫలితాలు నిరూపిస్తున్నాయని అన్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయిస్తున్నట్లు మంత్రి తెలిపారు. మౌలిక సదుపాయాల కల్పన కోసం సుమారు రూ.8 కోట్ల అంచనాలతో ప్రతిపాదనలు పంపినట్లు వెల్లడించారు. తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, డిజిటల్ సదుపాయాలు వంటి అంశాల్లో మార్పులు తీసుకురానున్నట్లు చెప్పారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను మంత్రి అభినందించి నగదు పురస్కారాలు అందజేశారు. విద్యార్థుల కృషిని ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు ప్రోత్సాహక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, వివిధ ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

#### ధర్మపురిలో సాగునీటి దిశగా అడుగులు

ధర్మపురి నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను ఏడాదిలోపు పూర్తి చేసి రైతులకు నీటి సమస్య లేకుండా చేస్తామని హామీ ఇచ్చారు. ఆదివారం ధర్మపురి మండలంలోని అక్కేపల్లి చెరువును మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సందర్శించారు. ఇరిగేషన్ అధికారులతో పాటు స్థానిక ప్రజాప్రతినిధులు, రైతులతో కలిసి చెరువు పరిస్థితిని పరిశీలించారు. ప్రాజెక్టు పనుల పురోగతి, రైతుల సమస్యలు, సాగునీటి అవసరాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రత్యక్షంగా విన్న మంత్రి త్వరితగతిన పరిష్కార చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.




ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, గత ప్రభుత్వ కాలంలో కేవలం కాగితాలకే పరిమితమైన అక్కేపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుతో పాటు రోల్లవాగు ప్రాజెక్టు, వెల్గటూర్ ఎత్తిపోతల పథకం, పత్తిపాక రిజర్వాయర్ పనులను పూర్తి చేస్తామని తెలిపారు. రైతులకు ఉపయోగపడేలా ప్రాజెక్టులను త్వరగా పూర్తి చేయాలని ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సాగునీటి వనరులు మెరుగుపడితే రైతుల ఆర్థిక పరిస్థితి కూడా బలపడుతుందని పేర్కొన్నారు. నియోజకవర్గంలోని సాగునీటి ప్రాజెక్టులపై రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డితో ప్రత్యేకంగా సమావేశమైనట్లు మంత్రి వెల్లడించారు. అలాగే ప్రాజెక్టులకు అవసరమైన నిధుల విడుదల విషయంలో ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో కూడా చర్చించినట్లు తెలిపారు. ప్రాజెక్టు పనులు ఏడాదిలోపు పూర్తి చేయడానికి ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతోందన్నారు. అక్కేపల్లి లిఫ్ట్ ఇరిగేషన్ పనులు చేపట్టిన పాత ఏజెన్సీ సక్రమంగా పని చేయకపోవడంతో, వారి స్థానంలో కొత్త ఏజెన్సీకి అవకాశం కల్పించినట్లు మంత్రి తెలిపారు. త్వరలోనే పనులు వేగవంతం చేసి రైతుల సూచనల మేరకు సుమారు 5 వేల ఎకరాలకు సాగునీరు అందించనున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే అనేక గ్రామాల రైతులకు భారీ ప్రయోజనం కలుగుతుందని చెప్పారు. రోల్లవాగు ప్రాజెక్టు విషయంలో గత ప్రభుత్వంపై మంత్రి తీవ్ర విమర్శలు చేశారు. అటవీ శాఖ అనుమతులు లేకుండానే పనులు ప్రారంభించారని ఆరోపించారు. ప్రాజెక్టు అంచనాలు పెంచినా రైతులకు ఒక్క ఎకరానికి కూడా నీరు అందలేదని అన్నారు. ప్రస్తుతం అటవీ శాఖ అనుమతులు సాధించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని, అన్ని అనుమతులు పూర్తి చేసి ప్రాజెక్టును పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. వచ్చే గోదావరి పుష్కరాల ఏర్పాట్లపై కూడా మంత్రి కీలక ప్రకటన చేశారు. ప్రభుత్వం తొలి విడతగా రూ.118 కోట్లు విడుదల చేసిందని తెలిపారు. ఇందుకు సంబంధించిన టెండర్ ప్రక్రియ త్వరలోనే పూర్తి కానుందని వెల్లడించారు. పుష్కరాల ఏర్పాట్లలో అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని సూచించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు.

## నేటి నుంచి క్రీడాపండుగ

### యువజన వారోత్సవాలు ప్రారంభం




హైదరాబాద్, మే 17 (ఈవార్తలు): ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళికలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న క్రీడా, యువజన వారోత్సవాలకు నేడు ఘనంగా శ్రీకారం చుట్టనున్నారు. మే 18 నుంచి 23 వరకు జరిగే ఈ కార్యక్రమాలు యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు ఆరోగ్యకరమైన జీవన విధానంపై అవగాహన కల్పించనున్నాయి. హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియం టెన్నిస్ కాంప్లెక్స్‌లో ఉదయం 6 గంటలకు ఈ కార్యక్రమాన్ని రాష్ట్ర క్రీడాశాఖ మంత్రి వాకిటి శ్రీహరి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ, రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శివసేనారెడ్డి, క్రీడల సలహాదారు ఏపీ జితేందర్ రెడ్డి, ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జయేష్ రంజన్ పాల్గొననున్నారు. క్రీడా వారోత్సవాల్లో భాగంగా ముందుగా మెగా జుంబా కార్యక్రమం నిర్వహించనున్నారు. అనంతరం ఐదు కిలోమీటర్ల వాక్‌థాన్ కార్యక్రమం చేపట్టనున్నారు. యువత, క్రీడాకారులు, మహిళలు, ఫిట్‌నెస్ అభిరుచి కలిగిన వారు ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొననున్నారు. ఆరోగ్యంపై అవగాహన పెంపొందించేందుకు ఈ కార్యక్రమాలను ప్రత్యేకంగా రూపొందించినట్లు అధికారులు తెలిపారు. ఎల్బీ టెన్నిస్ కాంప్లెక్స్ వద్ద మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్ జెండా ఊపి వాక్‌థాన్‌ను ప్రారంభించనున్నారు. దాదాపు 2000 మందికి పైగా యువ క్రీడాకారులు ఇందులో పాల్గొననున్నారు. ఈ 5ఖ వాక్‌థాన్ ఎల్బీ స్టేడియం నుంచి ప్రారంభమై బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్, ట్యాంక్‌బండ్, అంబేద్కర్ విగ్రహం, బూర్గుల రామకృష్ణారావు భవనం, ఈగల్ సర్కిల్, ఆర్బీఐ, అసెంబ్లీ కంట్రోల్ రూమ్ మీదుగా తిరిగి ఎల్బీ ఇండోర్ స్టేడియం వరకు కొనసాగుతుంది. వాక్‌థాన్ అనంతరం ఎల్బీ ఇండోర్ స్టేడియంలో యోగ, మెడిటేషన్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ముఖ్యంగా దివ్యాంగులు, మహిళలు, సీనియర్ సిటిజన్ల కోసం ప్రత్యేకంగా ఈ కార్యక్రమాలను ఏర్పాటు చేశారు. శారీరక, మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపరచే లక్ష్యంతో యోగ సెషన్లు నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం యువతలో క్రీడలపై ఆసక్తి పెంచేందుకు ప్రత్యేకంగా ఈ వారోత్సవాలను నిర్వహిస్తోంది. గ్రామీణ స్థాయి నుంచి పట్టణ ప్రాంతాల వరకు యువతను క్రీడల వైపు ఆకర్షించడమే లక్ష్యంగా కార్యక్రమాలు రూపొందించారు. ఫిట్‌నెస్, ఆరోగ్యం, క్రమశిక్షణ వంటి అంశాలపై అవగాహన కల్పించేందుకు ఈ వారోత్సవాలు ఉపయోగపడనున్నాయి. క్రీడా, యువజన వారోత్సవాల ద్వారా ఆరోగ్యవంతమైన తెలంగాణ నిర్మాణమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని అధికారులు చెబుతున్నారు. యువతలో శారీరక దృఢత్వం పెంపొందించడం, మానసిక ఆరోగ్యంపై దృష్టి సారించడం, సామాజిక చైతన్యం పెంచడం వంటి అంశాలకు ఈ కార్యక్రమాలు దోహదపడనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా వారం రోజుల పాటు వివిధ క్రీడా, ఫిట్‌నెస్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



వయ్యారి చిత్రం



కమిలా మెండెస్

## మెగా 158 కోసం కసరత్తులు



మెగాస్టార్ చిరంజీవి ఈ వయసులోనూ తన ఉత్సాహం, ఎనర్జీతో యువ హీరోలకు స్ఫూర్తినిస్తూనే ఉన్నారు. ప్రస్తుతం 'విశ్వంభర' వంటి భారీ సినిమాలో నటిస్తూనే, తన తదుపరి చిత్రం కోసం కూడా సిద్ధమవుతున్నారు. ఈ క్రమంలో ఆయన జిమ్‌లో కఠినమైన వర్కౌట్లు చేస్తున్న వీడియోను సోషల్ మీడియాలో పంచుకోగా, అది వైరల్ అవుతోంది. దర్శకుడు బాబీతో తన 158వ సినిమా చేస్తున్నట్లు చిరంజీవి ప్రకటించారు. మే 21న ఈ సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనున్నట్లు తెలిపారు. ఈ మేరకు తన ట్వీట్‌లో, "ప్రతిరోజూ పరిధులు దాటి పనిచేయడానికి దొరికే మరో అవకాశం. నా ప్రియమైన బాబీతో మరో గుర్తుండిపోయే ప్రయాణం కోసం ఉత్సాహంగా ఎదురుచూస్తున్నా" అని పేర్కొన్నారు. ఈ వీడియోలో చిరంజీవి తీవ్రంగా చెమటోడుస్తూ కసరత్తులు చేయడం ఆయన డెడికేషన్‌కు నిదర్శనంగా నిలుస్తోంది.

## త్రిష మా కుటుంబం

త్రిష గురించి ప్రముఖ నిర్మాత ఎంఎస్ రాజు చేసిన వ్యాఖ్యలు చర్చనీయాంశం అయ్యాయి. ఎంఎస్ రాజు దర్శకత్వంలో రూపొందిన 'అగధ' సినిమా విడుదలకు ముస్తాబయింది. ఇటీవల విడుదలైన ట్రైలర్‌కి మంచి స్పందన వచ్చింది. సినిమా ప్రమోషన్ మొదలు పెట్టిన ఎంఎస్ రాజు తాజాగా ఒక ఇంటర్వ్యూలో త్రిష గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేశాడు. ఆ ఇంటర్వ్యూలో త్రిష గురించి ఎంఎస్ రాజు మాట్లాడుతూ... మహేష్ బాబుతో తాను నిర్మించిన అర్జున్ సినిమాలో మొదట హీరోయిన్‌గా త్రిషను అనుకున్నాం. కథలోని పాత్రకు ఆమె సెట్ కాదని దర్శకుడు భావించారు. అందుకే ఆమెను తీసుకోలేక పోయామని అన్నాడు. అర్జున్ సినిమాలో త్రిష ఉంటే ఫలితం మరోలా ఉండేది అనేది కొందరి అభిప్రాయం. ఆ విషయం పక్కన పెడితే ఎంఎస్ రాజు ఇంకా మాట్లాడుతూ త్రిషతో తమ ఫ్యామిలీకి ఉన్న అనుబంధం గురించి చెప్పుకొచ్చాడు. త్రిష తమ ఫ్యామిలీ మెంబర్ అన్నట్లుగా రాజు చెప్పుకొచ్చారు. వర్షం సినిమా కోసం త్రిష ఏకంగా 75 రోజుల పాటు వానలో తడుస్తూ షూటింగ్‌లో పాల్గొంది.






## యూత్‌కు లవ్, రిలేషన్ తెలియదు: తమన్నా

హీరోయిన్ తమన్నా భాటియా నేటితరం యువతకు ప్రేమ, బంధాల (రిలేషన్స్) పై సరికొత్త లెక్చర్లు ఇస్తూ వార్తల్లో నిలిచారు. ముఖ్యంగా నటుడు విజయ్ వర్మతో బ్రేకప్ అయినప్పటి నుంచి ఆమె సమయం దొరికినప్పుడల్లా ప్రేమకు సంబంధించిన తన వ్యక్తిగత అభిప్రాయాలను పంచుకుంటున్నారు. ఇటీవల ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో తమన్నా మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరి జీవితంలో ప్రేమ అనేది ఒక్కసారి మాత్రమే కాదు, పలుమార్లు పుట్టవచ్చని మరియు అదే నిజమైన ప్రేమ అని వ్యాఖ్యానించారు. నేటితరం యువతకు లవ్, రిలేషన్ అంటే సరిగ్గా తెలియక గందరగోళానికి గురవుతున్నారని ఆమె అభిప్రాయపడ్డారు. ఒక వ్యక్తిని నిజంగా ప్రేమించాలని భావిస్తే వారికి పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని, మన భావాలను వారిపై బలవంతంగా రుద్దడం ద్వారా ప్రేమను నిరూపించుకోలేమని స్పష్టం చేశారు. ప్రేమ అనేది కేవలం ఒకే ఒకసారి కలిగే అనుభవం కాదని, అది జీవితంలో అనేకసార్లు జరగాల్సిన ప్రేరణ అని పేర్కొంటూ, ఇది బహిరంగంగా హావభావాల ద్వారా వ్యక్తపరిచేది కాదని, అంతర్లీనంగా పుట్టే ఒక భావోద్వేగమని తమన్నా వివరించారు.

## ఐదుగురు పిల్లల దత్తత: మనోజ్



టాలీవుడ్ యాక్టర్లలో ఓ వైపు సినిమాలతో వినోదం అందిస్తూనే.. మరోవైపు సామాజిక సేవలో తనవంతు బాధ్యతగా ముందుండే వారిలో టాప్‌లో ఉంటాడు మంచు మనోజ్. ఈ టాలెంటెడ్ యాక్టర్ సామాజిక సేవలో భాగంగా సరికొత్త ముందడుగు వేసి ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తున్నాడు. మంచు మనోజ్, అతని సతీమణి భూమా మౌనిక రెడ్డి ఐక్య ధైర్య సేన సమితి పేరిట కొత్త ట్రస్ట్ ప్రారంభించారు. ఈ నేపథ్యంలో తొలి అడుగుగా ఐదుగురు పిల్లలను దత్తత తీసుకొని, వారిని చదివిస్తానని చెప్పాడు మంచు మనోజ్. ఈ సందర్భంగా మంచు మనోజ్ మాట్లాడుతూ.. ఎప్పటి నుంచో మేం సేవా కార్యక్రమాలంటే ముందుంటాం.. 10 మందికి ఎప్పుడు ఏ అవసరమున్నా ముందుంటాం.. నేను కానీ నా సతీమణి మౌనిక కానీ మా చిన్నప్పటి నుంచి మా పెద్దల నుంచి 10 మంది కోసం నిలబడటం బలంగా నేర్చుకున్నం. ఇప్పటివరకు ఎన్నో కార్యక్రమాలు చేశాం. కానీ అదంతా ఒక ఆర్గనైజేషన్ కింద ఒక ట్రస్ట్‌కింద ఫాం చేసి మా ఐడియాలజీ పది మందికి సేవ చేయాలని ముందుకొచ్చే వారికి ఒక మంచి ప్లాట్‌ఫాం కావాలని ఈ రోజు ఐక్య ధైర్య సేనే సమితి మొదలుపెట్టడం జరిగిందన్నాడు.



## నేడే పెద్ది ట్రైలర్ రిలీజ్


గ్లోబల్ స్టార్ రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో వస్తున్న భారీ చిత్రం 'పెద్ది'. ఈ సినిమాకు సంబంధించిన ప్రమోషన్స్ రేపటి నుంచి ఫుల్ స్పీడ్ లో కొనసాగనున్నాయి. ఈ చిత్రం ట్రైలర్‌ను సోమవారం ముంబైలో ఒక గ్రాండ్ ఈవెంట్ లో విడుదల చేసేందుకు సర్వం సిద్ధమైంది. "అతడి పోరాటం రేపటి నుంచి మొదలు" అనే క్యాప్షన్‌తో పెద్ది టీమ్ ప్రచారాన్ని హోరెత్తిస్తోంది. "పెద్ది ట్రైలర్ టేకోవర్" పేరుతో ముంబైలోని జియో వరల్డ్ డ్రైవ్‌లో మే 18న మధ్యాహ్నం 3 గంటల నుంచి ఈ ఈవెంట్ జరగనుంది. ఈ సందర్భంగా సినిమా ట్రైలర్‌ను అభిమానులు, మీడియా సమక్షంలో విడుదల చేయనున్నారు. ఇప్పటికే విడుదల చేసిన పోస్టర్లు, ప్రచార చిత్రాలు సినిమాపై అంచనాలను పెంచుతున్నాయి.

## విజయ్ సరదా మనిషి

టాలీవుడ్, కోలీవుడ్‌లలో వరుస క్రేజీ ఆఫర్లు అందుకుంటూ హీరోయిన్ మాళవిక మోహనన్ దూసుకుపోతోంది. తాజాగా ఒక ఇంటర్వ్యూలో తమిళనాడు సీఎం, కోలీవుడ్ స్టార్ హీరో విజయ్ పై ప్రశంసల వర్షం కురిపించారు. వారిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన బ్లాక్‌బస్టర్ హిట్ 'మాస్టర్' సినిమా షూటింగ్ జ్ఞాపకాలను ఆమె ఈ సందర్భంగా పంచుకున్నారు. 'మాస్టర్' సినిమా మొదటి రోజు షూటింగ్‌లోనే తనకు చాలా కష్టమైన సీన్ ఎదురైందని, దానివల్ల తన ఫోకస్ మొత్తం డైలాగ్స్‌పైనే పెట్టాల్సి వచ్చిందని మాళవిక తెలిపారు. అయితే, విజయ్ మాత్రం ఎంతటి కష్టమైన సీన్ అయినా సరే.. ఎంతో ప్రశాంతంగా (కూల్‌గా), ప్రతి చిన్న విషయంపై దృష్టి పెడుతూ నటిస్తారని ఆమె కొనియాడారు. సెట్స్‌లో ఆయన అందరితో చాలా సరదాగా ఉంటారని చెప్పారు. మోహన్ లాల్, రజనీకాంత్, విజయ్ వంటి సీనియర్ మోస్ట్ సూపర్ స్టార్ల నుంచి ఎన్నో విలువైన విషయాలు నేర్చుకున్నానని మాళవిక వెల్లడించారు. ముఖ్యంగా వారి టైమ్ మేనేజ్‌మెంట్, క్రమశిక్షణ తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. ఉదయం 7 గంటలకు షూటింగ్ అని చెబితే.. వారు ఉదయమే 6.55 కల్లా సెట్స్‌లో హాజరవుతారని స్పష్టం చేశారు. అంతటి పెద్ద స్టార్స్ సమయపాలన పాటించడం వల్లే ఇండస్ట్రీలో నిర్మాతలకు భారీగా డబ్బు వృథా కాకుండా ఉంటుందని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు.







| ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక | | | | |
|---|---|---|---|---|
| జట్టు | ఆ | గె | ఓ | పా |
| బెంగళూరు | 13 | 9 | 4 | 18 |
| గుజరాత్ | 13 | 8 | 5 | 16 |
| హైదరాబాద్ | 12 | 7 | 5 | 14 |
| పంజాబ్ | 13 | 6 | 6 | 13 |
| రాజస్థాన్ | 12 | 6 | 6 | 12 |
| చెన్నై | 12 | 6 | 6 | 12 |
| ఢిల్లీ | 13 | 6 | 7 | 12 |
| కోల్‌కతా | 12 | 5 | 6 | 10 |
| ముంబై | 12 | 4 | 8 | 8 |
| లక్నో | 12 | 4 | 8 | 8 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ- ఓడినవి పా- పాయింట్లు

# వెయిటింగ్‌లో పంజాబ్ బెర్తు!

## శ్రేయస్ సేనకు మరో ఓటమి.. ప్లేఆఫ్‌కు చేరిన బెంగళూరు

ఐపీఎల్ 2026 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు(ఆర్‌సీబీ) ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధించింది. ఆదివారం ధర్మశాల వేదికగా జరిగిన మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన ఆర్‌సీబీ..23 పరుగుల తేడాతో విజయం సాధించింది. ముందుగా బ్యాటింగ్‌లో సత్తా చాటిన ఆర్‌సీబీ.. ఆ తర్వాత బౌలింగ్‌లో దుమ్మురేపింది. ఈ గెలుపుతో ఆర్‌సీబీ 18 పాయింట్లతో ప్లే ఆఫ్స్ బెర్త్ ఖరారు చేసుకోగా.. పంజాబ్ కింగ్స్ తమ అవకాశాలను సంక్లిష్టంగా మార్చుకుంది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటంగ్ చేసిన ఆర్‌సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 4 వికెట్లకు 222 పరుగులు చేసింది. వెంకటేశ్ అయ్యర్(40 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్స్‌లతో 73 నాటౌట్), విరాట్ కోహ్లీ(37 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 58) హాఫ్ సెంచరీలతో చెలరేగగా..దేవదత్ పడిక్కల్(25 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లతో 45)పర్వాలేదనిపించాడు. టిమ్ డేవిడ్(12 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 28) మెరుపులు మెరిపించాడు. పంజాబ్ బౌలర్లలో హర్‌ప్రీత్ బ్రార్(2/35) రెండు వికెట్లు తీయగా.. యుజ్వేంద్ర చాహల్, అర్ష్‌దీప్ సింగ్ చెరో వికెట్ తీసారు. అనంతరం పంజాబ్ కింగ్స్ 20 ఓవర్లలో 8 వికెట్లకు 199 పరుగులు చేసి ఓటమిపాలైంది. శశాంక్ సింగ్(27 బంతుల్లో 4 ఫోర్లు, 4 సిక్స్‌లతో 56) హాఫ్ సెంచరీతో రాణించిగా.. సూర్యాన్ష్ షెడ్గే(22 బంతుల్లో 2 ఫోర్లు, 2 సిక్స్‌లతో 35) పర్వాలేదనిపించాడు. ఆర్‌సీబీ బౌలర్లలో రసిక్ సలామ్ (3/36) మూడు వికెట్లు తీయగా.. భువనేశ్వర్ కుమార్(2/38) రెండు వికెట్లు పడగొట్టాడు. జోష్ హాజెల్ వుడ్, సుయాష్ శర్మ, రొమారియోషెపెర్డ్ తలో వికెట్ తీసారు.

### పవర్ ప్లేనే కొంప ముంచింది: శ్రేయస్

పవర్ ప్లేలోనే మూడు వికెట్లు కోల్పోవడం తమ ఓటమిని శాసించిందని పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ అన్నాడు. ప్రత్యర్థి జట్టు తమ కంటే మెరుగైన ప్రదర్శన చేసిందని అంగీకరించాడు. 'ఆర్‌సీబీ బ్యాటర్లు అద్భుతమైన ఆరంభాన్ని అందుకున్నారు. పవర్ ప్లే ముగిసిన తర్వాత మా బౌలర్లపై ఒత్తిడిని పెంచుతూ పరుగులు రాబట్టారు. 222 పరుగులు చేయడమనేది నిజంగా మెచ్చుకోదగ్గ ప్రదర్శన. మేం బౌలింగ్‌లో ఆశించిన స్థాయిలో వికెట్లు తీయలేకపోయాం. అయితే పవర్ ప్లేలోనే మేం మ్యాచ్‌ను కోల్పోయాం. పవర్ ప్లేలోనే మూడు వికెట్లు కోల్పోయాం. మా జట్టులో ఎక్కువ పరుగులు చేసేది ప్రభ్‌సిమ్రాన్ సింగ్, ప్రియాన్ష్ ఆర్య. సాధారణంగా పవర్‌ప్లేలో వారు మాకు మంచి ఆరంభాన్ని అందిస్తారు. కానీ ఈ మ్యాచ్‌లో వారు విఫలమయ్యారు. నేను కూడా త్వరగానే ఔటయ్యాను. చాలా నిరాశగా ఉంది. కానీ మిడిలార్డర్‌లో శశాంక్ సింగ్, మార్కస్ స్టోయినిస్ అద్భుత ప్రదర్శన కనబర్చారు. మేం దాదాపు ఓవర్‌కు 10 పరుగుల రన్‌రేట్‌తో మ్యాచ్‌లో నిలిచాం. కానీ చివరికి లక్ష్యానికి కొద్ది దూరంలో ఆగిపోయాం. భువనేశ్వర్ కుమార్, జోష్ హేజిల్‌వుడ్ అద్భుతంగా బౌలింగ్ చేశారు. ఫలితాలతో సంబంధం లేకుండా నేను ఎప్పుడూ సానుకూలంగానే ఉంటాను. ఫలితాలు నా వ్యక్తిత్వాన్ని మార్చలేవు. నేను ఎల్లప్పుడూ బలమైన దృక్పథంతోనే ముందుకు సాగుతాను. నేను గతం గురించి ఎక్కువగా ఆలోచించే వ్యక్తిని కాదు. ఇది అయిపోయింది.. ముగిసిపోయింది. రేపు ఉదయం నేను మళ్ళీ కొత్త సూర్యోదయాన్ని చూస్తాను. చీకటి తర్వాత ఎప్పుడూ వెలుగు ఉంటుందని నేను నమ్ముతాను.'అని శ్రేయస్ అయ్యర్ పేర్కొన్నాడు.



## వెంటనే వైభవ్‌ను తీసుకోవాలి: రవిశాస్త్రి

ఐపీఎల్‌లో స్లార్లు ఎందురున్నా విధ్వంసక ఆటతో బౌలర్లపై విరుచుకుపడుతున్న వైభవ్ సూర్యవంశీ 'సెంటర్ ఆఫ్ అట్రాక్షన్' గా నిలుస్తున్నాడు. తొలి బంతి నుంచే బాదడుకు తెరతీసే ఈ కుర్రాడిని భావి తారగా అభివర్ణిస్తున్నారు విశ్లేషకులు. అంతేనా.. వైభవ్‌ను భారత సీనియర్ జట్టులోకి తీసుకోవాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. పదిహేనేళ్లకే ప్రపంచ స్థాయి బౌలర్లను భయపెడుతున్న ఈ చిచ్చరపిడుగును ఆలస్యం చేయకుండా అంతర్జాతీయ మ్యాచుల్లో ఆడించాలని మాజీ కోచ్ రవి శాస్త్రి అభిప్రాయపడుతున్నాడు. పద్దెనిమిదో సీజన్‌లో ఐపీఎల్ అరంగేట్రం చేసిన వైభవ్ సూర్యవంశీ.. పంతొమ్మిదోలో తన పత్రాపాన్ని చూపిస్తున్నాడు. మంచినీళ్లు తాగినంత సులువగా సిక్సర్లు బాదుతూ.. రికార్డు శతకం కొట్టిన ఈ యంగ్‌స్టర్.. భారత జట్టు వైపు వడివడిగా అడుగులు వేస్తున్నాడు. ఏ జట్టులోకి వచ్చిన వైభవ్‌ను సీనియర్ జట్టులోనూ ఆడించాలని అంటున్నాడు రవి శాస్త్రి. స్పోర్ట్స్ ప్రజెంటర్ సంజనా గణేశన్‌తో శాస్త్రి మాట్లాడుతూ.. వైభవ్‌కు భారత జట్టు తలుపులు ముప్పావు వంతు తెరిచే ఉన్నాయని అన్నాడు. 'నేను మీకో విషయం చెబుతాను. ప్రతిభావంతుడైన వైభవ్ లాంటి వాళ్లను ప్రోత్సహించాలంటే వెంటనే అవకాశాలివ్వాలి. టీ20 ఫార్మాట్‌కు వైభవ్ ఏ విషయంలోనూ తీసిపోడు. ప్రస్తుతం భీకర ఫామ్‌లో ఉన్న అతడు ప్రపంచ క్రికెట్‌లో ఎన్నో శిఖరాలు అధిరోహిస్తాడు. అందుకు మనం అవకాశం ఇవ్వాలి. వైభవ్ 15 ఏళ్ల పిల్లాడు, అతడికి 16 ఏళ్లుంటాయి కాదు14 ఏళ్లున్నాయి అని చాలామంది మాట్లాడుతున్నారు. తనకంటే వయసులో రెండింతలు పెద్దవారైన బౌలర్లను అతడు ఎదుర్కొంటున్న తీరు చూడండి. అతడికి వయసు అనేది సమస్యే కాదు. నా ఉద్దేశంలో వైభవ్ ఎంతో సమర్థుడు. ఐర్లాండ్ పర్యటనకు ఎంపిక చేస్తే అతడు అద్భుతాలు చేస్తాడు. నేనైతే అతడిని గమనిస్తుంటాను' అని పేర్కొన్నాడు.

## వైభవ్ సూర్యవంశీ మరో చరిత్ర

రాజస్థాన్ రాయల్స్ టీనేజ్ సెన్సేషన్ వైభవ్ సూర్యవంశీ చరిత్ర సృష్టించాడు. ఐపీఎల్ చరిత్రలోనే ఓ సీజన్‌లో అత్యధిక సిక్స్‌లు బాదిన భారత బ్యాటర్‌గా నిలిచాడు. ఐపీఎల్ 2026 సీజన్‌లో భాగంగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో 3 సిక్స్‌లు బాదడం ద్వారా ఈ ఫీట్ సాధించాడు. తద్వారా సన్‌రైజర్స్ హైదరాబాద్ స్టార్ బ్యాటర్ అభిషేక్ శర్మ రికార్డ్‌ను అధిగమించాడు. ఐపీఎల్ 2024 సీజన్‌లో అభిషేక్ శర్మ 42 సిక్స్‌లు బాదగా.. వైభవ్ సూర్యవంశీ తాజా సీజన్‌లో మొత్తం 43 సిక్స్‌లతో అతన్ని అధిగమించాడు. ఈ జాబితాలో వైభవ్(43), అభిషేక్ శర్మ(42) తర్వాత శ్రేయస్ అయ్యర్(39), విరాట్ కోహ్లీ (38), సూర్యకుమార్ యాదవ్(38) తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. ఐపీఎల్ 2025 సీజన్‌లో శ్రేయస్ అయ్యర్ 39 సిక్స్‌లు బాదగా.. విరాట్ కోహ్లీ 2016, 2024లో 38 సిక్స్‌లు కొట్టాడు. సూర్యకుమార్ యాదవ్ 2025లో 38 సిక్స్‌లు బాదాడు. ఈ సీజన్‌లో వైభవ్ సూర్యవంశీ మరో లీగ్ మ్యాచ్ ఆడాల్సి ఉంది. ఒకవేళ ఆ జట్టు ప్లే ఆఫ్స్ చేరితే వైభవ్ సిక్సర్ల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది.

## నేడు ధోనీ లాస్ట్ మ్యాచ్!?

### సొంత స్టేడియంలో వీడ్కోలు

ఐపీఎల్ 2026 సీజన్‌లో చెన్నై సూపర్ కింగ్స్ కేవలం రెండే మ్యాచులు ఆడాల్సి ఉంది. అదీనూ సొంత మైదానం చెపాక్‌లో ఒకే ఒక్క పోరు మాత్రమే మిగిలి ఉంది. మే 18న సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో తలపడనుంది. ఈ మ్యాచ్ ఇటు ఎస్ఆర్‌హెచ్‌కు ఎంత ముఖ్యమో.. సీఎస్‌కేకూ అంతే కీలకం. మరోవైపు క్రికెట్ దిగ్గజం ఎంఎస్ ధోని ఈ సీజన్‌లో ఒక్క మ్యాచ్ కూడా ఆడలేదు. చెపాక్‌లోనైనా ధోనిని చూస్తామా? లేదా? అని అభిమానుల్లో ఉత్కంఠ నెలకొంది. ఈ క్రమంలో ఓ వార్త నెట్టింట వైరల్‌గా మారింది. ధోని ఆ మ్యాచ్‌లో ఆడి.. రిటైర్‌మెంట్ ప్రకటిస్తాడని కథనాలు వస్తున్నాయి. వాటిపై క్రికెట్ వ్యాఖ్యాత హర్షా భోగ్లే ఆసక్తికర కామెంట్స్ చేశారు. "సీఎస్‌కే - ఎస్ఆర్‌హెచ్ మ్యాచ్‌లో సర్‌ప్రైజ్‌ను చూసే అవకాశం ఉంది. ఈ సీజన్‌లో చెపాక్ వేదికగా ఒకే ఒక్క మ్యాచ్ మాత్రమే మిగిలి ఉంది. అభిమానులను ఆశ్చర్యానికి గురి చేసే నిర్ణయం వచ్చినా నాకేమీ సర్‌ప్రైజ్ కాదు" అని భోగ్లే విశ్లేషించాడు.





## ఆర్ఆర్‌కు ఢిల్లీ షాక్

### ప్లే ఆఫ్స్ ఆశలు సజీవం

ప్లే ఆఫ్స్ రేసుకు ఆమడ దూరంలో నిలిచిన ఢిల్లీ క్యాపిటల్స్ ఐదో స్థానంలోని రాజస్థాన్ రాయల్స్‌కు షాకిచ్చింది. భారీ ఛేదనలో ఓపెనర్లు కేఎల్ రాహుల్(56), పొరెల్(51).. శతక భాగస్వామ్యంతో గెలుపు పునాది వేశారు. కానీ టపటపా మూడు వికెట్లు పడడంతో రాజస్థాన్ పోటీలోకి వచ్చింది. కానీ అక్షర్ పటేల్ (34 నాటౌట్) కెప్టెన్ ఇన్నింగ్స్‌కు ఇంప్యాక్ట్ సబ్ అశుతోష్(18 నాటౌట్) మెరుపులు తోడవ్వగా ఢిల్లీ 5 వికెట్లతో గెలుపొంది ఆశలు సజీవంగా ఉంచుకుంది. పంతొమ్మిదో సీజన్ ప్లే ఆఫ్స్ రేసులోని జట్లకు వరసగా షాక్‌లు తగులుతున్నాయి. చావోరేవో పోరులో రాజస్థాన్‌ను 193కే నిలువరించిన ఢిల్లీకి ఓపెనర్లు కేఎల్ రాహుల్(56), అభిషేక్ పొరెల్(51) అదిరే ఆరంభమిచ్చారు. పట్టుదలగా ఆడిన ఈ ఇద్దరూ రాజస్థాన్ బౌలర్లకు అవకాశమివ్వకుండా బౌండరీలతో లక్ష్యాన్ని కరిగించారు. పవర్ ప్లేలో కొట్టిన ఈ ద్వయం శతక భాగస్వామ్యంతో ఢిల్లీని గెలుపు దిశగా నడిపింది. పదో ఓవర్ తర్వాత పొరెల్ ఔటైనా.. సహిల్ పరాఖ్(9) తోడుగా రాహుల్ ఇన్నింగ్స్ నిర్మించాడు. పరాఖ్‌ను ఔట్ చేసి ఈ జోడీని విడదీశాడు అర్చర్. క్రీజునంటుకున్న రాహుల్‌ను శనక బౌల్డ్ చేయడంతో రాజస్థాన్ ఆశలు చిగురించాయి. ఢిల్లీకి మరో ఝలికిస్తూ స్టబ్స్(4)ను వెనక్కి పంపాడు ఆర్చర్. డేంజరస్ మిల్లర్(9)ను బ్రిజేశ్ ఔట్ చేయగా.. అక్షర్ పటేల్(34 నాటౌట్) సిక్సర్ కొట్టగా చివరి ఓవర్లో 7 రన్స్ ఢిల్లీకి అవసరం కాగా.. ఉత్కంఠ నెలకొంది. ఇంప్యాక్ట్ సబ్ అశుతోష్ (18 నాటౌట్) తొలి బంతికే బౌండరీ, సిక్సర్‌తో ఢిల్లీకి 5 వికెట్ల విజయాన్ని, కీలకమైన రెండు పాయింట్లను కట్టబెట్టాడు. గెలవక తప్పని మ్యాచ్‌లో రాజస్థాన్ రాయల్స్ భారీ స్కోర్ అవకాశాన్ని చేజార్చుకుంది. ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ(46) మెరుపు ఆరంభాన్నిచ్చాడు. యశస్వీ(12) త్వరగానే ఔటైనా.. ధ్రువ్ జురెల్(53) జతగా చెలరేగిన వైభవ్.. మిచెల్ స్టార్క్(4-40), ఎంగిడి(2-24) వంటి సీనియర్ పేసర్లకు షాకిస్తూ సిక్సర్లతో అలరించాడు. అతడి విధ్వసంతో పవర్ ప్లేలోనే రాజస్థాన్ వికెట్ నష్టానికి 75 రన్స్ చేసింది. హాఫ్ సెంచరీ ముందు వైభవ్ ఔటైనా.. జురెల్, రియాన్ పరాగ్(51) దూకుడుగా ఆడి స్కోర్ బోర్డును ఉరికించారు. కానీ, స్టార్క్ మిడిల్ ఓవర్లలో దెబ్బకొట్టాడు. 15వ ఓవర్లో వరస బంతుల్లో పరాగ్, ఫెరీరా(0)ను.. ఐదో బంతికి రవి సింగ్(4)ను పెవిలియన్ చేర్చడంతో రాజస్థాన్ స్కోర్ వేగం తగ్గింది. డెత్ ఓవర్లలో ఎంగిడి, స్టార్క్‌లు పొదుపుగా బౌలింగ్ చేయడంతో రాజస్థాన్ బ్యాటర్లకు దంచేసే అవకాశమే రాలేదు. ఫలితంగా చివరి 36 బంతుల్లో 6 వికెట్లు కోల్పోయి కేవలం 33 పరుగులే చేసింది రాజస్థాన్.

ఈవార్తలు
# ప్రజావాణి
సోమవారం 18-5-2026, జగిత్యాల
www.evarthalu.com
నేటి ఈవార్తలు


నేటి ఈవార్తలు | సంపాదకీయం | Editorial

# అధికార దర్పం పనికిరాదు!

ప్రజాస్వామ్యంలో పదే పదే వినిపించే మాట.. 'చట్టం ముందు అందరూ సమానమే'. కానీ, ఆ మాట ఆచరణలో కనిపించినప్పుడే సామాన్యుడికి న్యాయవ్యవస్థపై, ప్రభుత్వ పనితీరుపై నమ్మకం పెరుగుతుంది. హోదా, ధనం, అధికారం ఎంత ఉన్నా సరే, తప్పు చేస్తే చట్టం ముందు తల వంచాల్సిందేనని నిరూపించే ఘటనలు సమాజానికి అత్యంత అవసరం. ఇటీవల వెలుగుచూసిన బీజేపీ అగ్రనేత బండి సంజయ్ కుమారుడి వ్యవహారం ఈ వాస్తవానికి నిలువెత్తు అద్దం పడుతోంది. రాజకీయ నాయకులు ప్రజా సేవకులుగా సమాజానికి ఆదర్శంగా ఉండాల్సిన బాధ్యత వారిపై ఉంటుంది. వారి కుటుంబ సభ్యుల నుంచి కూడా సమాజం అదే ఆశిస్తుంది. కానీ, 'మా నాన్న ఎంపీ, మా నాన్న ఎమ్మెల్యే, నాకు ఎదురులేదు' అనే అహంకారంతో చెలరేగిపోయే యువతకు గొడ్డలిపెట్టు. హోదా చూసి చట్టం తన కళ్లకు గంతలు కట్టుకోదు. నేరం ఎవరు చేసినా నేరమే అన్నట్లుగా వ్యవస్థలు స్పందించిన తీరు హర్షణీయం. ఈ డిజిటల్ యుగంలో ప్రతి పౌరుడూ ఒక జర్నలిస్టే. సాక్ష్యాలు క్షణాల్లో ప్రపంచానికి చేరిపోతున్న ఈ రోజుల్లో, పలుకుబడితో కేసులను మాఫీ చేయించుకోవడం లేదా తప్పును కప్పిపుచ్చుకోవడం అసాధ్యం. ఎంత ప్రజాభిమానం ఉన్న నాయకుడైనా, కుటుంబ సభ్యుల నిర్వాకాల వల్ల సమాజంలో తలదించుకోవాల్సి వస్తుంది. కాబట్టి, పిల్లలకు అధికార దర్పం కన్నా, చట్టం పట్ల, తోటి మనుషుల పట్ల గౌరవం నేర్పించడం అత్యవసరం. 'ఎంత తోపులైనా చట్టం ముందు తలవంచాల్సిందే' అన్నది కేవలం సినిమా డైలాగులకే పరిమితం కాకూడదు. అది వాస్తవ రూపం దాల్చినప్పుడే అసలైన ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుంది. అధికారం అనేది బాధ్యతను పెంచుతుందే తప్ప, చట్టాన్ని ఉల్లంఘించే లైసెన్స్ ఇవ్వదని ప్రతి ఒక్కరూ గ్రహించాలి.

# రాయూరప్పల్లో అమ్మ రూపం

చెరువు కట్టకు మైసమ్మ..
కాలువ గట్టుకు గంగమ్మ..
పొలిమేరలకు పోలేరమ్మ..
రోగాల పాలిటి నల్ల పోచమ్మ..
అమ్మలకు అమ్మ పెద్దమ్మ..
రూపం లేదు.. వేషం లేదు..
రాయిూరప్పా అన్నీ అమ్మ రూపాలే..
ఆ తల్లుల అనుగ్రహమే..
పల్లెసీమలకు సంక్షేమం..



కోవెల సంతోష్ కుమార్
రచయిత, 9052116463

చెరువుకో దేవత.. కాలువకో దేవత.. రోగాల బారి నుంచి రక్షించేందుకు ఓ దేవత.. పొలం గట్టున దేవత.. పొలిమేరల్లో దేవత.. తలుపుకో దేవత.. తలపుల్లో దేవత.. ఊరూరా దేవతలే.. రూపం ఉండదు.. ఆకారం ఉండదు.. వింత ఆచారాలు.. విచిత్ర సంప్రదాయాలు.. గుళ్లూ గోపురాలూ ఉండవు.. రోడ్డు పక్కనో.. కాలువ గట్టునో.. చిన్న నీడ కల్పించి అందులోనే పూజిస్తారు.. రాయి.. రప్పా, చెట్టు.. కొమ్మా.., కుంకుమ భరిణ, ఇవన్నీ గ్రామ దేవతలే.. పసుపు కుంకుమలే అలంకారం.. వేపమండలే ఆహార్యం.. వీరంగమే ఆనందం.. పోతురాజులే పౌరుషం.. మైసమ్మ, పోలేరమ్మ, పెద్దమ్మ.. లక్ష్మి, పార్వతి, సరస్వతి.... ఏమిటీ తేడా... అందరిదీ ఒక స్వరూపం కాదా? గ్రామ దేవతలకు.. సంప్రదాయ దేవతలకూ తేడా ఎందుకు? ఆచారాల్లో పూజల్లో అంతరాలు దేనికి? గ్రామ దేవతల్లో అమ్మవారికే ప్రాధాన్యం దేనికి? జానపద జాతరల్లో వింత వీరంగాలు, పూనకాలు ఎలా వస్తాయి? దేవీ పూనకం నిజమేనా? భవిష్యవాణి సాధ్యమేనా? లక్ష్మి, సరస్వతి, పార్వతి దేవతల గురించి మనకు తెలుసు.. భారతంలోనో, రామాయణంలోనో, వేర్వేరు పురాణాల్లోనో వాళ్ల గురించి ఉంది కాబట్టి కొద్దో గొప్పో తెలుసు.. వాళ్లకంటూ ఏవేవో లోకాలున్నాయనీ, ఆ లోకాల్లో నుంచి భూమిపై వున్న మనల్ని రక్షిస్తుంటారని భావిస్తాం.. వీళ్ల కోసం పెద్ద పెద్ద ఆలయాలు.. వాటిలో అర్చనలు, నైవేద్యాలు.. పెద్ద ఎత్తున చేస్తాం... మరి ఈ గ్రామాల్లో దేవతల మాటేమిటి? వీరి ప్రస్తావన ఎక్కడుంది? ఇంత నిరాడంబరంగా అలంకారాలు, ఆహార్యం లేకుండా ప్రజలను దీవిస్తున్న ఈ మూలపుటమ్మలు ఎక్కడి నుంచి వచ్చారు?

ఒక చోట బోనం.. ఇంకోచోట నిలువెత్తు బంగారం.. మరో చోట విచిత్ర వేషాలు.. జానపదుల జాతరల్లో ఎందుకిలా జరుగుతాయి.. ఆలయాల్లో కనిపించే క్రమశిక్షణ.. పూజాపునస్కారాల విధానం ఈ జాతరల్లో వేరే విధంగా ఎందుకు ఉంటాయి? సంప్రదాయ దేవతలకు, గ్రామదేవతలకు తేడా ఏదైనా ఉందా? పెద్ద పెద్ద ఆలయాలు.. బంగారం, వజ్రాలు పొదిగిన ఆభరణాలు.. పట్టు వస్త్రాలు.. నైవేద్యాలు.. నీరాజనాలు.. హిందూ దేవాలయాల్లో భక్తి సంప్రదాయ వైభవం కనిపిస్తుంది. కానీ, ఆ వైభవం గ్రామదేవతల జాతరల్లో కనిపించదు.. అమ్మవారికి బోనమే నైవేద్యం... పసుపు, కుంకుమలే అలంకారం.. బెల్లమే బంగారం. వేదం చదువుతూ, అర్చనలు చేసే విధానం ఆ ఆలయాలది.. పూనకాలతో వీరంగం వేస్తూ, ఎలుగెత్తి అమ్మను ఆవహించమని పిలుస్తూ ఆదుకొమ్మని ఆరాధించే అరమరికలు లేని ఆరాధన ఈ జానపదులది. గ్రామీణ దేవతలంతా అడవి బిడ్డలకు అమ్మలు. తమకు తెలిసిన విధానంలో, తమకు తోచిన ఆచారంలో, తమకు దొరికిన పదార్థాలనే నైవేద్యంగా పెట్టి తమకు పవిత్రంగా కనిపించిన రూపాన్ని స్వచ్ఛంగా కొలిచే అపురూపమైన భక్తి ఉద్యమం ఇది. ఫలం, పుష్పం, తోయం అన్నారు పెద్దలు. భగవంతునికి భక్తితో ఏది సమర్పించినా ప్రేమతో స్వీకరిస్తాడట.. ఈ గ్రామదేవతల జాతరల్లో అచ్చంగా జరుగుతున్నది అదే.. అందుకే అమ్మ వెంటనే కరుణిస్తుంది.. భక్తులను పూనుతుంది.. వారి ద్వారానే మిగతావారి కోరికలను తీరుస్తుంది.

మేడారంలో సమ్మక్క-సారలమ్మ జాతర.. విజయనగరంలో పైడితల్లి జాతర.. తూర్పు గోదావరిలో సత్తెమ్మతల్లి, తలుపులమ్మల జాతర... ఇక హైదరాబాద్లో చెప్పవశమా..? ఆషాఢం వచ్చిందంటే.. బోనాల సంబరం మిన్నంటుతుంది. విచిత్రమేమంటే.. మిగతా జాతరలన్నీ పల్లెల్లోనే జరుగుతాయి.. బోనాలు మాత్రం మహానగరం భాగ్యనగరంలో జరుగుతాయి.. అదే విశేషం.. అలా ఇలా కాదు.. ఆషామాషీ కాదు.. ఒకరోజు రెండు రోజులు కాదు.. ఒక చోట కాదు.. ఒక గుళ్లో కాదు.. ఒక అమ్మవారు కాదు.. రాజధాని అంతటా.. భాగ్యనగరం నిండైన పసుపు కుంకుమలతో నిండు ముత్తైదువలా అలరారుతుంది. నెల రోజుల పాటు సంబరాలు చేసుకుంటుంది. ఆషాఢ మాసంలో ఆదివారం వచ్చిందంటే చాలు.. హైదరాబాద్లో తెలంగాణకు చెందిన వారి ప్రతి ఇంటా బోనం లేస్తుంది. అమ్మకు భోజనం పెట్టడానికి పురుషులు, ఇల్లాళ్లు, కన్నెపిల్లలు.... ఇలా ఒకరేమిటి వయోలింగ భేదం లేకుండా అంతా ఆలయాలకు తరలివెళ్తారు. శివసత్తులు చిందులేసి అమ్మకు వినోదాన్ని అందిస్తారు. ఇక పోతరాజుల వీరంగం సరేసరి.. బలిష్ఠమైన వ్యక్తులు శరీరం అంతా పసుపు రాసుకుని, కాలికి గజ్జెలు కట్టుకుని వీర నాట్యం చేస్తుంటే అది చూడటానికి రెండు కళ్లు చాలవు. ఘటాల సమర్పణ, తొట్టెల ఊరేగింపు, పోతరాజుల హడావుడి నాగరికులకు తెలియని, అంతుపట్టని, అపురూప సన్నివేశాలు.. చూసేందుకు వేయి కన్నులున్నా సరిపోదు. అమ్మవారు భక్తులపై పూనటం ఈ జాతరల్లో ప్రత్యేక సన్నివేశాలు. భక్తుల నోటివెంట దేవతే భవిష్యవాణి చెప్పిస్తుంది. ఇది హేతువాదులకు నమ్మశక్యం కాదు. కానీ, ఇలా ఒక చోటనే జరగదు. జానపదుల జాతరలన్నిటిలో.. గ్రామదేవతల పూజలన్నింటిలో పూనకాలు సహజంగానే వస్తాయి.. వీరంగాలు ఇంతకంటే సహజంగా జరుగుతాయి. వీటిమీద విశ్వాసం అలాంటిది.. పల్లె ప్రజలపై గ్రామదేవతల ఆధిపత్యం అలాంటిది.

లక్ష్మి, సరస్వతి, పార్వతిల గురించి మనకు తెలుసు. భారతంలోనో, రామాయణంలోనో, వేర్వేరు పురాణాల్లోనో వాళ్ల గురించి ఉంది కాబట్టి కొద్దో గొప్పో తెలుసు. వాళ్లకంటూ ఏవేవో లోకాలున్నాయనీ, ఆ లోకాల్లో నుంచి మనల్ని రక్షిస్తుంటారని చదువుకున్నాం. వీళ్ల కోసం పెద్ద ఆలయాలు. వాటిలో అర్చనలు, నైవేద్యాలు పెద్ద ఎత్తున చేస్తాం. మరి ఈ గ్రామాల్లో దేవతల మాటేమిటి? వీరి ప్రస్తావన ఎక్కడుంది? ఇంత నిరాడంబరంగా అలంకారాలు, ఆహార్యం లేకుండా ప్రజలను దీవిస్తున్న ఈ మూలపు టమ్మలు ఎక్కడి నుంచి వచ్చారు? అడవితల్లి బిడ్డలు ఆ అడవినే నమ్ముకుని ఉండేవాళ్లు.. ఆ అడవిని విడిచి రాలేని వాళ్లు.. నాగరికులకు దూరంగా ఉండేవారు ఏర్పరుచుకున్న రూపాలు గ్రామ దేవతలు.. చెరువు కట్ట తెగిపోకుండా ఉండేందుకు కట్ట పక్కన ఒక రూపాన్ని ఏర్పాటు చేసుకుంటే అక్కడ కట్టమైసమ్మ వెలిసింది... కాలువ గట్టు తెగకుండా కాపాడేందుకు గట్టు మైసమ్మ వచ్చింది.. పోలియో, చికెన్ పాక్స్ వంటి వ్యాధుల బారి నుంచి పల్లెను కాపాడేందుకు పోలేరమ్మ అవతరించింది. ఊరిని కాపాడేందుకు శివార్లలో ఇప్పుడు మనకు హనుమంతుడి విగ్రహాలు అతి పెద్దవి కనిపిస్తున్నాయి కానీ, గతంలో గ్రామదేవతలే అక్కడి ప్రజలకు సర్వస్వం.. వాళ్లు తినే తిండి..



తాగే కల్లు, జంతు బలులు ఇవే అమ్మవారికి నైవేద్యం.. ఆ కల్లు తాగి అమ్మవారి ముందు వీరంగం వేస్తారు.. జాతరలో అది తప్పు కాదు.. అలా చేస్తేనే అమ్మ అనుగ్రహిస్తుందని విశ్వాసం. పూజల్లో ప్రాధాన్యం లభించేది పసుపు, కుంకుమ, వేప, బెల్లం వంటి పదార్థాలకే.. ఇవన్నీ ఏదో విధంగా అన్ని రకాల వ్యాధులకు మందులుగా ఉపయోగపడేవే.. జంతు బలులు మినహా మిగతా వన్నీ జానపద సమాజంతో ముడిపడి ఉన్నవే.. అందుకే మేడారంలో ఎర్రని ధూళి ఎగిసెగిసి పడుతున్నా.. నిలువెత్తు పసుపు కుంకుమలు ఆ ధూళిని అణచేస్తాయి.. గొప్ప యాంటీ బయటిక్గా పసుపు పనిచేస్తుంది.

ఇప్పుడు పట్టణాల్లోనూ ఈ జాతరలు జరుగుతున్నాయంటే కారణాలు లేకపోలేదు.. హైదరాబాద్ వంటి నగరాలు ఇవాళ మహానగరంగా విస్తరించి ఉండవచ్చు. కానీ, ఇప్పుడు బోనాలు జరుగుతున్న ప్రతి గుడిని ఒక్కసారి గమనించండి.. ప్రతిచోటా గతంలో చెరువులో, కుంటలో, కాలువలో ఉన్నట్లు స్పష్టంగా చారిత్రక ఆనవాళ్లు చెప్తాయి. కట్టమైసమ్మలైనా, మహంకాళి అయినా గతంలో గ్రామీణ భాగ్యనగర ప్రజలు అర్చించినవే.. గ్రామం పోయి పట్టణాలు వెలిసినా, నగరాలుగా మారినా ట్రెడిషన్లో మాత్రం మార్పు రాలేదు.. ఈ జాతరల్లో, బోనాల్లో పాల్గొనే నాగరికులంతా గ్రామీణ నేపథ్యం ఉన్నవాళ్లే. వాళ్లు ఎంతగా ఎదిగినా తమ ట్రెడిషన్ ను మాత్రం మర్చిపోలేదు.. కాకపోతే.. సంపద పెరిగింది.. గ్రామీణ నేపథ్యం నుంచి క్రమంగా ఎదిగిన సమాజం ఆచారాల్లో కూడా కొద్ది కొద్దిగా మార్పులు తీసుకువచ్చింది. సంప్రదాయ దేవతలతో సమానంగా గ్రామదేవతలకు ఆలయాల నిర్మాణం జరిగింది.. అర్చనలు.. నైవేద్యాలు, పూజలు శాస్త్రోక్తంగా జరుగుతున్నాయి. ఒక్క మాటలో చెప్పాలంటే దేవతలంతా ఒక్కటిగా ట్రాన్స్ఫామ్ అయ్యారు.. ఏక రూపంలో ప్రజలకు కనిపిస్తున్నారు.. హిందూ ధర్మంలో భక్తికి సంబంధించి ఫ్లెక్సిబులిటీ ఉంటుంది.. ఎలాంటి నిర్బంధాలు ఉండవు.. దేవుణ్ణి కొలవటంలో, ఉపాసించటంలో ఎవరికి తోచిన మార్గాన్ని వాళ్లు అనుసరించవచ్చు.

విధి నిషేధాలు లేవు..
అందువల్లే ఈ దేశంలో..
ఈ జాతిలో, ఈ ధర్మంలో..
లెక్కలేనన్ని దేవతలు..
లెక్కలేనన్ని మతాలు..
లెక్కలేనన్ని ఆచారాలు..!

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.